PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 181 | 15 గురువారం అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

## ఐటీ అండ.. ఫార్మా దెబ్బ..

### నష్టాల్లో ముగిసిన మార్కెట్లు



- లాభాల స్వీకరణతో నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు
- సెన్సెక్స్ 252 పాయింట్లు, నిఫ్టీ 99 పాయింట్లు నష్టం
- ఫార్మా, హెల్త్‌కేర్ షేర్ల అమ్మకాల ఒత్తిడితో సూచీలు పతనం
- మార్కెట్లకు అండగా నిలిచిన ఐటీ షేర్లు

నేడు దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) షేర్లలో కొనుగోళ్ల మద్దతు నష్టాలను కొంతమేర పరిమితం చేసింది. వరుస లాభాల తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మార్కెట్లు ఒడుదొడుకులకు లోనయ్యాయి.

మిగతా 2 లో

## 24న హైదరాబాద్‌లో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ.



ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభను నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ వేదికగా ఈ సభను నిర్వహించనున్నారు. కాంగ్రెస్ ముఖ్య నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ హాజరుకానున్నారని పార్టీ నేతలు తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ నాయకత్వం, సుమారు ఒక లక్ష మంది ప్రజలతో సభను విజయవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని సమాచారం.ఢిల్లీలో ఇండీ కూటమి ఆందోళన కోసం తెలంగాణ కాంగ్రెస్ వెళ్లి అక్కడ నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు

## స్టాలిన్ గెస్చర్.. విజయ్ స్టైల్..

### ఆర్ఎస్ఎస్‌తో లింక్.. తమిళనాట కొత్త రాజకీయ దుమారం!

2 లో



- మొదలుపెట్టిన హ్యాండ్ జెస్టర్‌ను వైరల్ చేసిన సీఎం విజయ్
- అసెంబ్లీలో డీఎంకేను విమర్శిస్తూ విజయ్ అదే సంజ్ఞను ప్రదర్శన
- విజయ్ గెస్చర్‌ను ఆర్ఎస్ఎస్ సెల్యూట్‌తో పోల్చిన డీఎంకే ఐటీ వింగ్
- విజయ్‌ను ఆర్ఎస్ఎస్ 'దత్తపుత్రుడు'గా అభివర్ణించిన డీఎంకే
- తమిళనాట టీవీకే-డీఎంకే మధ్య రాజకీయ పోరుకు ప్రతీకగా మారిన సంజ్ఞ



# జనసేన పార్టీలోకి మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ

- రాధా ను ఆత్మీయ ఆలింగనం చేసుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్





**విజయవాడ, ప్రజాసీమ ప్రతినిధి, అక్టోబర్ 14**

దివంగత వంగవీటి మోహన రంగా తనయుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీ లో జాయిన్ అయ్యారు.బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పార్టీ కండువా కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరేందుకు జనసేన కేంద్ర కార్యాలయానికి బుధవారం సాయంత్రం వచ్చిన వంగవీటి రాధాకృష్ణని పవన్ కళ్యాణ్ ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం రాధాకృష్ణ తన అనుచరులను పవన్ కళ్యాణ్ కు పరిచయం చేశారు. ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడుతూ ప్రత్యేకంగా ఫోటోలు తీయించుకున్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాల కోసం కలసికట్టుగా పని చేద్దామని, ప్రజాసేవలో సమష్టి గా ముందుకు వెళదామని పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. రాధా చేరికతో పార్టీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేసారు. ఇదిలా ఉండగా రాధా కృష్ణ త్వరలో జరిగే బెజవాడ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థి గా ఖరారు కానున్నట్లు సమాచారం. ఆయన చేరికతో రాజకీయ రాజధాని విజయవాడ లో రాజకీయంగా పలు మార్పులు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయి.

### భారత్ ఎదుగుదలను

## మేమే పరిమితం చేసుకోలేం

- భారత్‌ను మధ్యస్థ శక్తి అనే వర్ణనను తిరస్కరించిన విదేశాంగ మంత్రి జైశంకర్
- మేము మధ్యస్థ శక్తి కాదు, మధ్యలో ఉన్న శక్తి అని వ్యాఖ్య
- జనాభా, ఆర్థిక వ్యవస్థ పరంగా ఈ వర్ణన దేశాన్ని పరిమితం చేస్తుందని స్పష్టం

2 లో



## జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం



ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో రోజువారీ విచారణకు సీబీఐ కోర్టు నిర్ణయించింది. సీబీఐ కేసులతోపాటు ఈడీ కేసులనూ రోజువారీగా విచారించాలని స్పష్టం చేసింది.

## బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



- విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు
- గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికిన ప్రముఖులు
- ఆలయంలో వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్న రాష్ట్రపతి
- దర్శనం కోసం వేచి ఉన్న భక్తులను ఆప్యాయంగా పలకరించిన ముర్ము

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఆమె అమ్మవారి సన్నిధికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల..

### మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు

02



- తొలి దశ నవంబర్ 26న పోలింగ్
- మూడో దశ డిసెంబర్ 2న ఎన్నికలు
- మున్సిపల్ ఎన్నికలు ఈ నెల 28న
- మున్సిపల్ ఫలితాలు ఈ నెల 30న
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నవంబర్ 3న

ప్రజాసీమ

# జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం

మొదటిపేజీ తరువాయి

రోజువారీ విచారణకు హాజరుకావాలని ఈడీ లాయర్లకు సైతం సూచించింది. సీబీఐ కోర్టులో పదేళ్లుగా 9 ఈడీ ఛార్జిషీట్లు పెండింగ్లో ఉన్నాయని, వాటితో పాటు డిశ్చార్జి పిటిషన్లు సైతం తేలకపోవడంతో ఈడీ కేసుల విచారణ ముందుకు సాగడం లేదని తెలిసిందే.జగన్‌తో పాటు మరో 70 మంది నిందితులను వ్యక్తిగతంగా విచారించాలని న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. జగన్‌పై దాదాపు దశాబ్దకాలంగా 9 ఈడీ ఛార్జిషీట్లు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఈడీ అధికారులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.సీబీఐ కోర్టులో నిందితులు దాఖలు చేసుకున్న డిశ్చార్జ్ పిటిషన్లపై తీర్పులు రాకపోవడంతో కేసుల విచారణ ముందుకు సాగడం లేదని ఈడీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈడీతో పాటు మాజీ మంత్రి హరిరామజోగయ్య, మరికొందరు కూడా విచారణను వేగవంతం చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సీబీఐ కోర్టు తీసుకున్న తాజా నిర్ణయంతో జగన్‌పై ఉన్న కేసుల విచారణ ఇకపై వేగంగా ముందుకు సాగే అవకాశం కనిపిస్తోంది.ఈ పరిణామాలతో ఈడీ కేసులను రోజువారీగా విచారించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పటివరకు ప్రధానంగా సీబీఐ కేసులనే కోర్టు విచారిస్తూ వస్తోంది. దీంతో తమ కేసులను కూడా విచారించాలని, కేసు త్వరగా తేలేలా సీబీఐ కోర్టును ఆదేశించాలని కోరుతూ ఈడీ పిటిషన్ వేసింది. ఈ క్రమంలో స్పందించిన సీబీఐ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే సోమవారం నుంచి ఈడీ కేసులను సీబీఐ కోర్టు వరుసగా రోజువారీ ప్రాతిపదికన విచారించే అవకాశం కనిపిస్తోంది. ఇటీవల ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఈడీ పిటీషన్‌ను స్పందిస్తూ మాట్లాడారు. జగన్ పై కేసులను రోజువారీగా కాదు, రోజు మొత్తం విచారణ చేపట్టేలా కోర్టులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానులు, ఉప ప్రధానుల మీద నమోదైన కేసుల్లోనే కేవలం 3 ఏళ్లలో తీర్పులు వచ్చాయని గుర్తుచేశారు. వీపీ సింగ్, పీవీ నరసింహారావుల మీద నమోదైన కేసుల్లోనే తక్కువ సమయంలోనే తీర్పులు వచ్చాయని, కానీ జగన్ అంతకంటే గొప్ప వ్యక్తా అని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి విచారణే ప్రారంభం కాని కేసులు ఉన్నాయని, సాధ్యమైనంత త్వరగా కేసుల విచారణ పూర్తి చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నో కేసుల్లో నిందితుడిగా ఉన్న జగన్ ఓ టర్మ్ సీఎంగా సైతం చేశారని.. కనుక సీబీఐ, ఈడీ రోజువారీ కాదు రోజుమొత్తం జగన్ కేసులపై విచారణ చేపట్టి వాస్తవాలు తేల్చాలన్నారు.

## జగ్గంపేట మండలంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ విస్తృత తనిఖీలు:

### -ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై జేసీ సమీక్ష.



**జగ్గంపేట, ప్రజాసీమ,అక్టోబర్ 14,**

రాబోయే ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయడమే కాకుండా, ధాన్యం తూకాల్లో పూర్తి పారదర్శకత పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జగ్గంపేట మండలంలో బియ్యం మిల్లు, చౌక ధరల దుకాణాలు, నిల్వ కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా జేసీ మొదటగా శ్రీ బాలాజీ బియ్యం మిల్లును సందర్శించి, మిల్లులోని యంత్రాల పనితీరు, ధాన్యం ఆరబెట్టే యంత్రాల సామర్థ్యం, బియ్యం తయారీ ప్రక్రియను కూలంకషంగా తనిఖీ చేశారు. రాబోయే పంట కాలంలో ధాన్యం కొనుగోళ్ల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం సేకరణ సమయానికి ఎలాంటి సాంకేతిక సమస్యలు లేకుండా, సీజన్ ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేసుకోవాలని మిల్లు నిర్వాహకులకు స్పష్టమైన సూచనలు చేశారు.అదేవిధంగా, జగ్గంపేట మండలం రామవరం గ్రామంలోని చౌక ధరల దుకాణం నంబరు 0418021ను సందర్శించి నిత్యావసర సరుకుల పంపిణీని పరిశీలించారు. దుకాణానికి చేరిన సరుకుల నిల్వలు, పంపిణీ తీరుపై డీలరును వివరాలు అడిగారు. బియ్యం కార్డుల్లోని సభ్యుల విద్యుత్ సమ్మతి ధ్రువీకరణను వేగవంతం చేయాలని, సరుకుల పంపిణీ శాతాన్ని మరింత పెంచాలని ఆదేశించారు. అలాగే లబ్ధిదారుల ఫోన్ నెంబర్ల అనుసంధాన ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని చౌక ధరల దుకాణం నిర్వాహకుడిని ఆదేశించారు.అనంతరం జేసీ జగ్గంపేట నిత్యావసర సరుకుల నిల్వ కేంద్రాన్ని సందర్శించి, అక్కడి తూకం యంత్రాల పనితీరును స్వయంగా తనిఖీ చేశారు. తూకాల్లో ఖచ్చితత్వం పాటిస్తున్నారా లేదా అని పరిశీలించి, ధాన్యం తూక ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండాలని స్పష్టం చేశారు. ఎక్కడా తూకాల్లో తేడాలు రాకుండా పక్కాగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను హెచ్చరించారు తదుపరి జగ్గంపేట--1 రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి, ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ముందస్తు చర్యలపై అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. మండలంలో ధాన్యం కోతల పరిస్థితి, పంట కోత యంత్రాల లభ్యత, సేకరణకు కావలసిన గోనె సంచులతో సహా ఇతర వసతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం విక్రయించే క్రమంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా, కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా సమగ్ర ప్రణాళికతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ పర్యటనలో జిల్లా జాయింట్ కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఆనందరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రసన్న లక్ష్మి దేవి, తహసీల్దార్ రమేష్ ఇతర శాఖల సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తక్షణం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో

- -తక్షణం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో
- -స్థానిక సంస్థల రెండో సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- -కొవ్వూరు, నిడదవోలు, మండపేట మున్సిపాలిటీల్లో 96 వార్డులకు ఎన్నికలు
- -మున్సిపాలిటీలకు అక్టోబర్ 28న పోలింగ్.. అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు
- -ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఒకే విడతలో..
- - గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహణలి
- - జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, ప్రజాసీమ, అక్టోబర్ 14**

రాష్ట్రంలో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల రెండో సాధారణ ఎన్నికల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసిందని తూర్పు గోదావరి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్లు జారీ చేసిందని, ఇందులో తూర్పు గోదావరి జిల్లాలో మూడు మున్సిపాలిటీల్లో ఎన్నికలు, 21 రూరల్ మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ లకు, ఎంపీపీ లకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియ లో భాగంగా దశల వారీగా నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు తెలిపారు.జిల్లాలోని కొవ్వూరు, నిడదవోలు, మండపేట మున్సిపాలిటీల్లో రెండో సాధారణ ఎన్నికలు నిర్వహించనున్నారు. కొవ్వూరు మున్సిపాలిటీలో 28 వార్డులు, నిడదవోలులో 32 వార్డులు, మండపేటలో 36 వార్డులు కలిపి మొత్తం 96 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మూడు మున్సిపాలిటీలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన, పోలింగ్, ఓట్ల లెక్కింపు తదితర కార్యక్రమాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తామన్నారు.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్మున్సిపాలిటీలకు సంబంధించి అక్టోబర్ 14న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. అక్టోబర్ 16న రిటర్నింగ్ అధికారి ఎన్నికల నోటీసు జారీ చేస్తారు. అక్టోబర్ 18 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అభ్యర్థుల ఉపసంహరణకు అక్టోబర్ 21 చివరి తేదీ కాగా, అదే రోజున పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, అవసరమైతే అక్టోబర్ 29న రీపోలింగ్ నిర్వహిస్తారు. అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఒకే విడతలోమండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జెడ్పీటీసీ) ఎన్నికలను ఒకే విడతలో నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఈ ఎన్నికలకు అక్టోబర్ 19న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అక్టోబర్ 21న ఎన్నికల నోటీసు జారీ చేసి, అక్టోబర్ 23 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అక్టోబర్ 24న నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 25న తిరస్కరించిన నామినేషన్లపై అప్పీళ్ల పరిష్కారం, అక్టోబర్ 27న అభ్యర్థుల ఉపసంహరణతో పాటు తుది అభ్యర్థుల జాబితా ప్రకటన జరుగుతాయి. నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 4న అవసరమైతే రీపోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన నిర్వహిస్తారు.గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లోగ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నారు. మొదటి విడతకు నవంబర్ 13న, రెండో విడతకు నవంబర్ 16న, మూడో విడతకు నవంబర్ 19న ఎన్నికల నోటిఫికేషన్లు విడుదల చేస్తారు.మొదటి విడతలో నవంబర్ 15న ఎన్నికల నోటీసు, నవంబర్ 17 వరకు నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 18న నామినేషన్ల పరిశీలన, నవంబర్ 19న అప్పీళ్ల పరిష్కారం, నవంబర్ 21న అభ్యర్థుల ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన, నవంబర్ 26న పోలింగ్, నవంబర్ 27న అవసరమైతే రీపోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన జరుగుతాయి.రెండో విడతలో నవంబర్ 18న ఎన్నికల నోటీసు, నవంబర్ 20 వరకు నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 21న పరిశీలన, నవంబర్ 22న అప్పీళ్ల పరిష్కారం, నవంబర్ 24న ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన, నవంబర్ 29న పోలింగ్, నవంబర్ 30న అవసరమైతే రీపోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన చేపడతారు.మూడో విడతలో నవంబర్ 21న ఎన్నికల నోటీసు, నవంబర్ 23 వరకు నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 24న పరిశీలన, నవంబర్ 25న అప్పీళ్ల పరిష్కారం, నవంబర్ 27న ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటన, డిసెంబర్ 2న పోలింగ్, డిసెంబర్ 3న అవసరమైతే రీపోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన జరుగుతాయి "పరోక్ష ఎన్నికల షెడ్యూల్లిపట్టణ స్థానిక సంస్థల్లో పరోక్ష ఎన్నికలకు అక్టోబర్ 28న, ఎంపీటీసీ/జెడ్పీటీసీ ఎన్నికలకు నవంబర్ 3న, గ్రామ పంచాయతీల మూడు విడతలకు వరుసగా నవంబర్ 13, 16, 19 తేదీల్లో నోటిఫికేషన్లు విడుదల చేస్తారు. సభ్యులకు నోటీసులు అందజేసి ప్రత్యేక సమావేశాల ద్వారా పరోక్ష ఎన్నికలు నిర్వహిస్తారు. పట్టణ స్థానిక సంస్థల్లో నవంబర్ 5న, ఎంపీటీసీ/జెడ్పీటీసీ ఎన్నికలకు నవంబర్ 11న, గ్రామ పంచాయతీల మూడు విడతలకు వరుసగా నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించారు. అవసరమైతే వరుసగా నవంబర్ 6, 12, 27, 30, డిసెంబర్ 3 తేదీల్లో తదుపరి తేదీల్లో ప్రక్రియ కొనసాగుతుంది.ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకిరాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు నియమావళి అమల్లో ఉంటుందని, సంబంధిత అధికారులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

## ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల.. మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పుణేఠా బుధవారం విజయవాడలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చింది.తొలి విడతలో భాగంగా 100 పట్టణ స్థానిక సంస్థలకు (ఖూదీ) ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, 19న పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.రెండో విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 3న పోలింగ్, 5న ఫలితాలు వెల్లడిస్తారు. ఇక మూడో విడతలో గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్, లెక్కింపు ప్రక్రియ పూర్తి చేస్తారు. రిజర్వేషన్లపై న్యాయపరమైన చిక్కుముడులు వీడి, ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమమైంది.

## బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

మొదటిపేజీ తరువాయి

ఈ పర్యటన కోసం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర హోంమంత్రి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ ఆమెను ఆలయంలోకి ఆహ్వానించారు. గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, వేద పండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు ఆమెకు పట్టువస్త్రాలు, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను రాష్ట్రపతి ఆప్యాయంగా పలకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఆమె ముందుకు సాగారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## 24న హైదరాబాద్‌లో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ.

మొదటిపేజీ తరువాయి

అదే సమయంలో కాంగ్రెస్ అధిష్టానం నిర్వహిస్తున్న కీలక సమావేశాలకు హాజరవుతూ సర్ ప్రక్రియతో పాటు సీఈసీకి వ్యతిరేకంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలు, ఆందోళనలపై చర్చలు జరుపుతున్నారు.కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించేంత వరకు తమ పోరాటం ఆగదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇదివరకే తెలిపారు. ఢిల్లీలోని రాహుల్‌గాంధీ నివాసంలో మంగళవారం నిర్వహించిన భేటీలో ఈ విషయంపై చర్చించినట్లు ఆయన వెల్లడించారు. సీఈసీ వ్యవహరిస్తున్న తీరు వల్ల దేశంలో కోట్లాది ప్రజలు ఓటు హక్కును కోల్పోతున్నారని ఆరోపించారు.

## ఐటీ అండ.. ఫార్మా దెబ్బ..

### నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

మొదటిపేజీ తరువాయి

ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 251.89 పాయింట్లు (0.34%) నష్టపోయి 72,781.89 వద్ద స్థిరపడింది. అదేవిధంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 99.25 పాయింట్లు (0.44%) క్షీణించి 22,622.70 వద్ద ముగిసింది. నిఫ్టీ కీలకమైన 22,650 స్థాయికి దిగువన ముగియడం గమనార్హం.సెన్సెక్స్ 30 షేర్లలో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ వంటివి ప్రధానంగా లాభపడ్డాయి. మరోవైపు, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోయి సూచీపై ఒత్తిడి పెంచాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బజాజ్ ఫైనాన్స్ టాప్ లూజర్లుగా నిలిచాయి.రంగాల వారీగా చూస్తే.. నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ హెల్త్‌కేర్ సూచీలు అత్యధికంగా నష్టపోయాయి. అయితే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ లాభాలతో ముగిసి మార్కెట్లకు కొంత అండగా నిలిచింది. ప్రధాన సూచీలతో పాటు బ్రాడర్ మార్కెట్లు కూడా బలహీనపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.08%, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.32% మేర నష్టపోయాయి.

## స్టాలిన్ గెస్చర్.. విజయ్ స్టైల్..

### ఆర్ఎస్ఎస్‌తో లింక్.. తమిళనాట కొత్త రాజకీయ దుమారం!

మొదటిపేజీ తరువాయి

తమిళనాడు రాజకీయాల్లో ఒక సాధారణ హ్యాండ్ జెస్టర్ ఇప్పుడు పెద్ద దుమారానికి కేంద్ర బిందువుగా మారింది. మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మొదలుపెట్టి, ప్రస్తుత ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ దాన్ని వైరల్ చేయగా, ఇప్పుడు ప్రతిపక్ష డీఎంకే ఆ సంజ్ఞను ఏకంగా ఆర్ఎస్ఎస్ సెల్యూట్‌తో పోలుస్తూ కొత్త వివాదానికి తెరలేపింది. ఇది రాష్ట్రంలో అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే మధ్య నడుస్తున్న రాజకీయ వైరాన్ని మరింత తీవ్రతరం చేసింది.అసలేం జరిగింది?ఈ వివాదానికి మూలం 2026 మార్చిలో పడింది. అప్పటి ముఖ్యమంత్రి స్టాలిన్, కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు చర్చలు ముగిసిన తర్వాత డీఎంకే ప్రధాన కార్యాలయం నుంచి బయటకు వస్తూ, అంతా సవ్యంగా ముగిసిందనడానికి గుర్తుగా తన చేతిని అడ్డంగా ఒకసారి తిప్పారు. ఈ వీడియో అప్పట్లో విపరీతంగా వైరల్ అయింది.ఆ తర్వాత ముఖ్యమంత్రి అయిన విజయ్, ఇటీవల అసెంబ్లీలో డీఎంకేపై విమర్శలు చేస్తున్న సమయంలో ఆ పార్టీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అప్పుడు విజయ్ కూడా దాదాపు అలాంటి సంజ్ఞనే ప్రదర్శించారు. దీంతో అధికార పక్ష సభ్యులు హర్షధ్వానాలు చేయగా, ఈ ఘటన సోషల్ మీడియాలో మరోసారి చర్చనీయాంశమైంది. ఇది కేవలం సరదాగా చేసిన చర్య అని టీవీకే వర్గాలు అంటున్నాయి.

ఆర్ఎస్ఎస్‌తో లింక్ పెట్టిన డీఎంకేఅయితే, ఈ పరిణామాన్ని డీఎంకే తీవ్రంగా పరిగణించింది.

### భారత్ ఎదుగుదలను మేమే పరిమితం చేసుకోలేం: ఎస్. జైశంకర్

మొదటిపేజీ తరువాయి

భారత్‌ను 'మధ్యస్థాయి శక్తి' అని పిలవడం సరికాదని, ఆ నిర్వచనంతో దేశాన్ని పరిమితం చేసినట్లు అవుతుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. తాము మధ్యస్థ శక్తి కాదని, 'మధ్యలో ఉన్న శక్తి' అని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం 'బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్'లో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

భారత్‌ను మధ్యస్థ శక్తిగా ఎందుకు అభివర్ణించకూడదు అని అడిగిన ప్రశ్నకు జైశంకర్ బదులిస్తూ, "ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా, సుమారు నాలుగు ట్రిలియన్ డాలర్ల జీడీపీతో, భవిష్యత్తులో అపారమైన అభివృద్ధి అవకాశాలు ఉన్న దేశానికి 'మధ్యస్థాయి శక్తి' అనే వర్ణన సౌకర్యంగా ఉండదు. ఆ నిర్వచనంతో మనల్ని మనమే పరిమితం చేసుకున్నట్టు అవుతుంది" అని వివరించారు. ఇతరులకు సాధికారత కల్పించే దేశాలనే మధ్యస్థ శక్తులుగా ప్రధాని మోదీ అభివర్ణించారని, కానీ భారత్ విషయంలో ఈ నిర్వచనం సరిపోదని ఆయన తెలిపారు.ప్రస్తుత ప్రపంచం కేవలం మధ్యస్థాయి శక్తులతోనే కాకుండా ఇతర దేశాలపై ఒత్తిడి తెచ్చే సాధనాలతో నిండి ఉందని జైశంకర్ విశ్లేషించారు.

# ఆర్కేవ్యాలి నాన్ టీచింగ్ సిబ్బందికి శిక్షణ

## - కంప్యూటర్ పరిజ్ఞానం, సైబర్, ఆర్థిక నేరాలపై అవగాహన

**వేంపల్లె ప్రజాసీమ:**

ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీకి చెందిన నాన్ టీచింగ్ సిబ్బందికి నాల్గు రోజుల పాటు శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయి. బుధవారం జిల్లా ఎప్లాయ్మెంట్, స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో కంప్యూటర్ పరిజ్ఞానం, సైబర్, ఆర్థిక నేరాలు, ఆన్లైన్ ఆర్థిక మోసాలపై ట్రైనర్స్ నరసింహులు, దివాకర్ లు అవగాహన కల్పించారు. నేర్చుకోండి, సాధన చేయండి, ఎదగండి అనే థీమ్ తో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో కంప్యూటర్ వినియోగంపై అవగాహన, సైబర్, ఆర్థిక మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సురక్షిత లావాదేవీలపై శిక్షణ ఇస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలు మెరుగు పరుచుకోవాలని డైరెక్టర్ ఆచార్య జీ.విజయ ప్రకాష్, పరిపాలన అధికారి రత్నకుమారి సూచించారు




# జయలక్ష్మీదేవిగా భక్తులకు అభయమిచ్చిన వాసవిమాత

## - అంగరంగ వైభవంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

## - ఆర్యవైశ్య అధ్యక్షుడు టి.చంద్రశేఖర్

**వేంపల్లె ప్రజాసీమ:**



అంగరంగ వైభవంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయని, నాల్గోవ రోజు జయలక్ష్మీదేవిగా భక్తులకు వాసవిమాత అభయమిచ్చినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ వెల్లడించారు. బుధవారం మంగళ వాయి ద్యాల నడుమ అర్చకుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో పంచామృత అభిషేకం, నివేదన, మహా మంగళ హారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. అలాగే ఉత్సవ మూర్తి వాసవిమాత రాత్రి శ్రీజయలక్ష్మీ దేవిగా భక్తులను కటాక్షించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వాసవి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన హైదరాబాద్ కు చెందిన గుణ ఇవెంట్స్ జానపద నృత్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి. అంతేకాకుండా పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన 55 అడుగుల అమ్మవారి లైటింగ్ కటౌట్, పురవీధుల్లో, ప్రధాన రహదారుల్లో లైటింగ్ కటౌట్ లు భక్తులకు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆయా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# రాజంపేటలో ఎన్నికల కోడ్ అమలు

**రాజంపేట (ప్రజా సీమ):**



రాజంపేట మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో, 2026 అక్టోబర్ 14 నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలులోకి వచ్చినట్లు మున్సిపాలిటీ అధికారులు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో అనుమతి లేకుండా రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు తదితర ప్రచార సామగ్రిని ఏర్పాటు చేయడం, అంటించడం నిషేధమని స్పష్టం చేశారు. ప్రజలు, రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని అధికారులు కోరారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు మున్సిపాలిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మిస్సైల్ మ్యాన్ ఏపిజె అబ్దుల్ కలాం..

## ప్రపంచ విద్యార్థుల దినోత్సవం

## - రాధాకృష్ణన్ నుండి కలాం వరకు.. - గురువు నుండి శిష్యుని వరకు..

## - ఉపాధ్యాయ దినోత్సవం, విద్యార్థుల దినోత్సవం.. ఒక విద్యా స్ఫూర్తి

**వేంపల్లె నుంచి ప్రత్యేక కథనం:**




అక్టోబర్ 15 డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం జన్మదినం ప్రపంచ విద్యార్థుల దినోత్సవం. దేశ అభివృద్ధికి, భవనాలు, పరిశ్రమలు, సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే సరిపోవు. జ్ఞానం, విలువలు కలిగిన, బాధ్యతా యుతమైన పౌరులు అత్యంత అవసరం. ఆ పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం. భారతీయ సంస్కృతిలో గురు-శిష్య సంబంధానికి అత్యున్నతమైన స్థానం ఉంది. గురువు జ్ఞానాన్ని అందిస్తే, శిష్యుడు ఆ జ్ఞానాన్ని స్వీకరించి తన జీవితాన్ని, సమాజాన్ని, దేశాన్ని అభివృద్ధి చేసే దిశగా ముందుకు తీసుకెళ్తాడు. ఈ గొప్ప సాంప్రదాయం ద్వాపరయుగంలో కాందీకుడు- శ్రీకృష్ణుడు, ద్రోణాచార్యుడు- అర్జునుడు రూపంలో. త్రేతా యుగంలో వశిష్ఠుడు -రాముని రూపంలో, కలియుగంలో చానిక్యుడు- చంద్రగుప్తుడు, విద్యారణుడు- హరిహర బుక్కరాయలు, రామ కృష్ణుడు-- స్వామి వివేకానంద రూపంలో చూడ వచ్చు. ఈ పరంపరలో ఆధునిక భారతదేశంలో స్వాతంత్ర అనంతరం ఇద్దరు మహోన్నత వ్యక్తులు మనకు ప్రత్యేకంగా నిలుస్తారు. వారిలో ఒకరు గురుత్వానికే ఆదర్శంగా నిలిచిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కాగా, మరొకరు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం. యాదృచ్ఛికంగా ఇద్దరూ రాష్ట్రపతులుగా అనగా దేశ ప్రథమ పౌరులుగా ఎన్నిక కావడం భారతదేశం వీరికి ఇచ్చిన కితాబుగా చెప్పవచ్చు. నేడు అక్టోబర్ 15వ తారీఖున అబ్దుల్ కలాం జయంతిని ప్రపంచ విద్యార్థుల దినోత్స వంగా జరుపుకున్న సందర్భంగా ఈ వ్యాసంను రాయడం జరుగుతుంది. గురు పూజోత్సవంను సెప్టెంబర్ 5న జరుపుకోవడం మనందరికీ తెలుసు. ఈ రెండు దినోత్సవాలు వేరువేరుగా కనిపించినప్పటికీ వాటి అంతరార్థం "విద్య ద్వారా వ్యక్తి మరియు దేశాభివృద్ధి సాధించడం". రాధాకృష్ణన్ నుండి అబ్దుల్ కలాం వరకు సాగిన ఈ గురువు, విద్యార్థి స్ఫూర్తి భారతదేశ విద్యా పరంపరకు గొప్ప ప్రతీక. సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప ఉపాధ్యాయుడిగా, తత్వవేత్తగా, రచయితగా, విద్యావేత్తగా భారతీయ విద్యారంగంపై విశేషమైన ప్రభావం చూపారు. వివిధ విశ్వవిద్యాలయాలకు కులపతిగా వ్యవహరించిన కాలంలో "విశ్వవిద్యాలయాలు కేవలం పట్టాలు అందించే కేంద్రాలు కాకుండా జ్ఞానం, పరిశోధన, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించే కేంద్రాలుగా" ఉండాలని అనేక కార్యక్రమాలను సూచించారు. స్వాతంత్రం అనంతరం విశ్వవిద్యాలయ విద్యా కమిషన్ కు అధ్యక్షత వహించి దేశంలో ఉన్నత విద్యాభివృద్ధికి పునాది వేశారు. ఈరోజు బహుళ ఖ్యాతి చెందుతున్న ఐఐటీలు ఏర్పాటు ఆయన మానస పుత్రిక అనడంలో సందేహం లేదు. విద్యార్థుల్లోని ఆలోచన శక్తిని, నైతిక విలువలను, సృజనాత్మకతను, సమాజంలో తన బాధ్యతను స్ఫూర్తినిచ్చే మార్గదర్శి విద్యేయని ఆయన విశ్వసించారు. అందుకే ఉపాధ్యాయులకు ఉన్నతమైన విద్య, నైతికత, సామాజిక బాధ్యత, నిరంతర అభ్యసన అవసరమని అభిప్రాయ పడ్డారు. ఆయన విద్యాతత్వం జ్ఞానాన్వేషణ, నైతిక విలువలు, దేశసేవ అనే మూడు ప్రధాన అంశాలపై ఆధారపడి ఉంటుంది." విద్య అనేది కేవలం ఉపాధి కోసం కాదు; వ్యక్తిత్వ వికాసం, దేశ నిర్మాణం కోసం " అనేది ప్రధాన సందేశం. విద్యావేత్తగా భారతీయ తత్వ శాస్త్రానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ప్రముఖ తత్వవేత్త కూడా రాధాకృష్ణన్ కావడం గమనార్హం. భారతీయ ఆధ్యాత్మికత, మానవతావాదం, నైతిక విలువలకు ఆయన రచనల ద్వారా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. భారతీయ తత్వశాస్త్రం, హిందూ ధర్మం మరియు తూర్పు - పడమర తాత్విక భావాలపై ఆయన వెలువరించిన రచనలు పాశ్చాత్య తత్వవేత్తలకు ఎంతో సవాలును విసిరాయి. ఈ రచనల ప్రదాన సారాంశం: గురువు సమాజ నిర్మాణ కర్త అని తెలియచేయడమే.

డాక్టర్ అవుల ఫకీర్ జనులద్దీన్ అబ్దుల్ కలాం సాధారణ కుటుంబ నేపథ్యంలో క్రమశిక్షణ కలిగిన విద్యార్థిగా కష్టపడి చదువుకొని భారతదేశంలో ప్రముఖ శాస్త్రవేత్తగా ఎదిగారు. ఏరోనాటికల్ ఇంజనీరింగ్ విద్య అభ్యసించి భారత అంతరిక్ష, రక్షణ పరిశోధనా కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషించి "మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా"గా పిలువబడ్డారు. బాల్యంలో శివ సుబ్రహ్మణ్యం అయ్యర్, ఇయదురై సోలమన్, రామకృష్ణ అయ్యర్ల బోధనలు స్ఫూర్తిగా తీసుకొని క్రమశిక్షణతో విద్యను అభ్యసించారు. ఏరోనాటికల్ ఇంజనీరింగ్ లో కె.వి.ఏ. పండలై మార్గదర్శకంలో ఎదిగి ఆచార్య విక్రమ సారాభాయ్ మార్గదర్శకత్వంలో అంతరిక్ష పరిశోధన రంగంలో మెళకువలు నేర్చుకున్నారు. తదనంతరం ఆచార్య సతీస్ ధావన్ నాయకత్వంలో భారత అంతరిక్ష రంగ అభ్యున్నతికి విశేషంగా సేవలందించారు. తన స్వీయ గ్రంథమైన "వింగ్స్ ఆఫ్ ఫైర్"లో విక్రమ...



# సామర్లకోటలో రూ.3.57 కోట్లు తో అభివృద్ధి పనులు ప్రారంభం

**సామర్లకోట, ప్రజాసీమ, అక్టోబర్ 14**

పట్టణాభివృద్ధిలో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధులు ,హైబ్రిడ్ యాన్యుటి మోడల్ నిధులు కలిపి సుమారు 3.57 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యాయి పట్టణ పరిధిలో పలు వార్డులలో పార్కులు అభివృద్ధి , సీసీ రోడ్డు నిర్మాణాలకు పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప,డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు లు బుధవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. 2వ వార్డు సీతారామకాలనీ లో పార్కు లో రూ 60.88 లక్షలు,8వ వార్డు పల్లిపేటలో రూ.100.53 లక్షలు,1వ వార్డు రాజీవ్ గృహ కల్ప లో రూ.83.22 లక్షలు,31వ వార్డు ఎంప్లాయిస్ కాలనీ లో రూ.25.63 లక్షలు,31వ వార్డు భాస్కర్ కాలనీలో రూ.77.81 లక్షల నిధులతో పార్కులు నిర్మాణానికి,31వ వార్డు సదా శివ నగర్ లో రూ.8.50 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి కొబ్బరి కాయలు కొట్టి పనులు ప్రారంభించారు. .ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్,మున్సిపల్ కమిషనర్ ఎన్ కనకారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అందుగుల మణికుమారి,కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, సరోజ వాసు, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్,తాతాపూడి కృష్ణ బాబు,వల్లూరి దొరబాబు, దాట్ల శ్రీనివాస్,నూతలపాటి అప్పారావు,అత్తిలి కృష్ణ,పట్టా వీరబాబు, మంచెం సాయిబాబు, బొందల రామలక్ష్మి, దేవళ్ళ జయలక్ష్మి,జల్లి సుధాకర్,పిల్లాడి సత్యవతి,గొల్లపల్లి సత్యనారాయణ,మడగల శ్యామ్, ఏలేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.లి



# చౌడేశ్వరి దేవి అలంకారంలో అన్నపూర్ణేశ్వరి!

**పుంగనూరు ప్రజాసీమ :**

పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ అన్నపూర్ణేశ్వరి దేవి ఆలయంలో బుధవారం దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారు చౌడేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు బాల సుబ్రమణ్యం, రాము అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి ఖడ్గం, త్రిశూలం, శంఖం, కపాలంతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ చౌడేశ్వరి దేవి కవచ మంత్రాలను పారాయణం చేశారు. ఈ సందర్భంగా అర్చకులు రాము మాట్లాడుతూ శివపురాణం ప్రకారం శివుడు నాట్యం చేస్తున్న సమయంలో ఆయన జటాజూటం నుంచి చౌడేశ్వరి దేవి ఆవిర్భవించిందని తెలిపారు. వీర చౌడేశ్వరి దేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకుంటే శత్రుజయం కలగడంతోపాటు శత్రుభయం తొలగుతుందని, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుంచి విముక్తి కలుగుతాయని ఆయన అన్నారు . అనేక కుటుంబాలు అమ్మవారిని ఇలవేల్పుగా కొలుస్తారని తెలిపారు. దసరా నవరాత్రుల్లో ప్రతిరోజూ సాయంత్రం ఆలయంలో సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు



# దేశానికి నెంబర్ వన్ ద్రోహి బిజెపి

## - స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ని గెలిపించండి

### - ఎన్.రఘువీరారెడ్డి, ఎన్.తులసిరెడ్డి

**వేంపల్లె ప్రజాసీమ:**

దేశానికి, రాష్ట్రానికి బిజెపి నెంబర్ ద్రోహి అని పిసిసి మాజీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి, ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి అన్నారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలైన వైకాపా, టిడిపి, జనసేన బిజెపి చేతిలో కీలుబొమ్మలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీలను ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో కరువు విలయ తాండవం చేస్తోందని, త్రాగు, సాగునీరు, ప్రశుగ్రాసం, ఉపాధి లభించక ప్రజలు అల్లాడి పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టిడిపి కూటమి నిమ్మకు నీరెత్తినట్లు ఉలుకు పలుకు లేకుండా పడి ఉన్నాయని మండిపడ్డారు. నిత్యవసర సరుకుల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేవన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అమ్మహస్తం పథకం కింద 9 నిత్యావసర సరుకులు చౌక ధరల దుకాణల ద్వారా ప్రజలకు అందించేవి అన్నారు. ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితుల్లో ఆ విధంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఆశీర్వదించాలని, అన్ని చోట్లా కాంగ్రెస్ పోటికి సిద్ధమని వెల్లడించారు. మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్, నాయకులు శ్రీహరిప్రసాద్, అహ్మద్ హుస్సేన్, మోహన గాంధీ, నచ్చు బాలకృష్ణ, సుబ్రమణ్యం, ధ్రువకుమార్ రెడ్డి, శివమోహన్ రెడ్డి, పూల నజీర్, జిలాని బాష, ఓబయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# వాల్మీకి జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలి

## - వాల్మీకులను సత్వరమే ఎస్టీ జాబితాలో చేర్చాలి

## - విఆర్ఎస్ఎస్ అధ్యక్షులు పాదల నరసింహులు డిమాండ్

**మదనపల్లె (ప్రజా సీమ) :**

ఈనెల 26వ తేదిన జరిగే వాల్మీకి జయంతి వేడుకను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించి ఐక్యతను చాటి చెప్పేందుకు సన్నద్ధం అవు తున్నట్లు వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పాదల నరసింహులు ప్రకటించారు.బుధవారం మదనపల్లె పట్టణం బేబీ వెల్కం హోం నందు వాల్మీకి శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకుల చిరకాల స్వప్నం ఎస్టి జాబితాతో చేర్చడంతోపాటు,వాల్మీకి జయంతి రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలు గడిచిపోయిన ఇప్పటి వరకు వాల్మీకులకు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చలేదని పేర్కొన్నారు. ఈనెల 26న జరిగే వాల్మీకి జయంతి వేడుకలను అన్ని వాల్మీకి సంఘాలతో సమన్వయం చేసుకొని ఘనంగా నిర్వహించడంతోపాటు ఐక్యతను చాటిచెబుతూ ప్రభుత్వానికి తమ గళాన్ని వినిపిస్తామని ప్రకటించారు. ఇప్పటికే గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు మహిళల నుంచి విద్యార్థి,యువత వరకు వాల్మీకి రిజర్వేషన్ సాధించుకోవడంపై చైతన్యం పెరిగిందని గుర్తుచేశారు.వాల్మీకి జయంతి రోజు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం,వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నామని,కావున వాల్మీకి కుటుంబ సభ్యులంతా పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా విఆర్ఎస్ఎస్ రాష్ట్ర కోశాధి కారిగా డాక్టర్ దేవరింటి సుధాకర్, అన్నమయ్య జిల్లా అధ్యక్షు లుగా మంజునాథ్ లను ఎంపిక చేసి నియామక పత్రాలను అందజేశారు. అలాగే వారిని శాలువా, గజమాలతో సన్మానించి, వాల్మీకి రిజర్వేషన్ సాధన కోసం, వాల్మీకి జాతి అభ్యున్నతి కోసం కార్యోన్ముఖులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర కోశాధికారిగా బాధ్యతలు తీసుకున్న డాక్టర్ డి.సుధాకర్ మాట్లాడుతూ తమపై విశ్వాసంతో రాష్ట్ర కోశాధికారిగా బాధ్యతలు అప్పగించిన విఆర్ఎస్ఎస్ అధ్యక్షులు పాదల నర సింహులుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈనెల 26న జరిగే వాల్మీకి జయంతి కార్య క్రమానికి పెద్దఎత్తున వాల్మీకి కుటుంబ సభ్యులు హాజరై జాతి ఐక్యతను చాటి చెప్పి,ప్రభుత్వానికి తమ వాణిని వినిపించాలని కోరారు.వాల్మీకుల ఎస్టీ జాబితా పునరుద్ధరణ చేసే విధంగా స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జిల్లా అధ్యక్షులు మంజునాథ్ మాట్లాడుతూ వాల్మీకి కుటుంబ సభ్యులందరూ వాల్మీకి జయంతిని జయప్రదం చేయడంతోపాటు ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించుకుంటే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాలని పిలుపు నిచ్చారు.మహిళా నాయకురాలు శోభా నాయుడు మాట్లాడుతూ వాల్మీకి జాతి హక్కులను సాధించుకోవడం కోసం వాల్మీకి మహర్షి జయంతి రోజున ఐక్యతను చాటి చెప్పి ప్రభుత్వానికి తమ గళాన్ని,బలాన్ని వినిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు గౌరమ్మ,పట్టణ అధ్యక్షులు టి.గాయత్రి,పట్టణ కార్యదర్శి తలారి గాయత్రి,మహిళా నాయకులు శోభానాయుడు,అరుణ వాల్మీకి కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



# రాజకీయంగా బీసీలకు పెద్దపీట వేసిన ఏకైక నాయకుడు నారా చంద్రబాబు నాయుడు

### టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్ రెడ్డి

**సిద్ధవటం ప్రజా సీమ**

స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీలకు) రాజకీయంగా సముచిత స్థానం కల్పించి, పెద్దపీట వేసిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ, ఏకైక నాయకుడు నారా చంద్రబాబు నాయుడు మాత్రమేనని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. సిద్ధవటంలో ఈరోజు జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ హయాంలో బీసీల సామాజిక, రాజకీయ ఎదుగుదలకు తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలను కొనియాడారు.



**చట్టపరమైన అడ్డంకులున్నా వెనకడుగు వేయని చంద్రబాబు**

సుప్రీంకోర్టు తీర్పుల వల్ల రిజర్వేషన్ల పరిమితులపై చట్టపరమైన అడ్డంకులు ఎదురవుతున్నప్పటికీ, బీసీలకు అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో చంద్రబాబు నాయుడు గారు విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారని మోహన్ రెడ్డి తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు ఏకంగా 40 శాతం సీట్లను కేటాయించిన మన ప్రియతమా నేత చంద్రబాబు నాయుడు గారికి బీసీలపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ప్రశంసించారు.

**గత ప్రభుత్వ హయాంలో బీసీలకు తీరని అన్యాయం**

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వై=జూ) ప్రభుత్వంపై మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గత పాలనలో బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి, వారి రాజకీయ ఎదుగుదలను దారుణంగా దెబ్బతీశారని ఆరోపించారు. కోర్టుల సాకుతో దాదాపు 16,800 మంది బీసీ నాయకులు స్థానిక సంస్థల్లో పదవులు కోల్పోయేలా చేసిన ఘోర కలియుగం గత ప్రభుత్వానిదేనని విమర్శించారు.

**టీడీపీ - బీసీల వెన్నుముక**

టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) హయాం నుంచే బీసీలను రాజకీయంగా చైతన్య పరిచి, వారికి గుర్తింపు తెచ్చింది తెలుగుదేశం పార్టీయేనని మోహన్ రెడ్డి గుర్తుచేశారు. 1995లోనే స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లను తెచ్చిన ఘనత చంద్రబాబు గారిదేనని, ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వంలో “జయహో బీసీ” నినాదంతో జనాభాలో సగభాగంగా ఉన్న వెనుకబడిన వర్గాలకు పూర్తి రాజకీయ బలాన్ని అందిస్తున్నారని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి చంద్రబాబు నాయుడు గారి నాయకత్వాన్ని, కూటమి ప్రభుత్వాన్ని భారీ మెజారిటీతో గెలిపించాలని శనివారపు మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# సమాజ సేవకు పునరంకితమవుతున్న భాస్కరాచారి

## - మానవ సేవే మాధవ సేవ అంటున్న డాక్టర్ అప్పినపల్లి

## - చైతన్య సర్వీస్ సొసైటీ సొంత భవన నిర్మాణానికి ఆర్థిక సహాయం



**మదనపల్లె (ప్రజా సీమ) :**

మానవ సేవే మాధవ సేవగా భావిస్తూ ఏబీసీ సేవా సంస్థ అధినేత,ఆరోగ్య ప్రదాత,ఆహార దాత డాక్టర్ అప్పినపల్లి భాస్కరా చారి సమాజ శ్రేయస్సే ధ్యేయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. ఇందు లో భాగంగా మదనపల్లె పట్టణంలో రెండు దశాబ్దాలకుపైగా వయో వృద్ధులకు,తోడు నీడలేని పిల్లలకు ఆశ్రయమిస్తూ విద్యాబుద్దులు నేర్పిస్తున్న చైతన్య సేవాసంస్థ సొంత భవన నిర్మాణానికి డా.అప్పినపల్లి భాస్కరాచారి సిమెంట్ బస్తాలను వితరణగా అందజేయడంతోపాటు ఆర్థిక సహాయాన్ని అందించి మరోమారు మానవత్వాన్ని చాటి చెప్పారు. సేవేదైవంగా నమ్ముతూ నిరాడంబరంగా, సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం పరితపించే సేవామూర్తి అని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ జనరల్ సెక్రటరీ ఏ.కవితారాణి కొనియాడారు.చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వహిస్తున్న అనాథ పిల్లల సంరక్షణ, విద్య,వైద్యం, ఆహారం,ఆరోగ్యం వంటి సేవలకు అప్పినపల్లి భాస్కరాచారి ఇది వరకు కూడ ఆర్థికంగా,వస్తురూపంలో అండగా నిలుస్తూ సంస్థ అభివృద్ధికి తమవంతు చేయూతను అందిస్తున్నారని తెలిపారు.ప్రస్తుతం సంస్థ సొంత భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో భవన నిర్మాణానికి అవసరమైన ముడిసరుకుల్లో భాగంగా సిమెంటును,ఆర్థిక సహాయాన్ని అందించి దాతృత్వాన్ని చాటుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.అంతే కాకుండా ఆనంద వృద్ధాశ్రమం లోని వృద్ధులకు కంటి పరీక్షలు, అన్నదానం, ఆహా రం,ఆరోగ్య సంరక్షణ వంటి సేవల ద్వారా వృద్ధుల జీవితాల్లో ఆనందాన్ని నింపుతున్నారని కొనియాడారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో 34వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేయడానికి ముందుకు వస్తున్న డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారికి చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ తరపున హృదయ పూర్వక శుభాకాంక్షలు



తెలియజేశారు. సమాజ అభివృద్ధికి సేవాభావం, నిబద్ధత, మానవత్వం ఎంతో అవసరమని,ప్రజాసేవలో ఆయన మరిన్ని విజయాలు సాధించి పేదలు,వృద్ధులు,నిరుపేద పిల్లలకు మరింత అండగా నిలవాలని కవితా రాణి ఆకాంక్షించారు.

# ఈనెల 16 నుండి నామినేషన్ స్వీకరణ!

**పుంగనూరు ప్రజాసీమ :**

మున్సిపాలిటీ పరిధిలోని ఒకటి నుండి 36 వార్డులకు సంబంధించి సభ్యులు చైర్ పర్సన్ నామినేషన్ స్వీకరణ ఈనెల 16 నుండి 18వ తేదీ వరకు పట్టణంలోని బసవరాజా ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు నామినేషన్ స్వీకరణ జరుగుతాయని అలాగే 19వ తేదీ నామినేషన్లు స్క్రూటీని 21వ తేదీ అభ్యర్థుల నామినేషన్లు ఉపసంహన్న ఉంటుందని సహాయ ఎన్నికల అధికారి, కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# అన్నపూర్ణా దేవి అలంకారములో బోయకొండ గంగమ్మ!

**పుంగనూరు ప్రజా సీమ :**

ప్రముఖ శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానము నందు అత్యంత వైభవముగాజరుగుచున్న దసరా మహోత్సవంలో మూడవ రోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణా దేవి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చినారు.ఆలయ అర్చకులు ఉభయదారులతో గణపతి హోమము, చండీ హోమము నిర్వహించినారు నూతనముగా అనంతపురము నుండి చౌడేపల్లి పోలీసు స్టేషనకు బదిలీపై వచ్చిన సి ఐ వెంకటేశ్వర్లు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమములో దేవస్థాన ఉప కమీషనరు, కార్యనిర్వహణాధికారి ఏకాంబరం, దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొని భక్తులకు తీర్థ ప్రసాదములు అందజేసి అమ్మవారి దర్శన భాగ్యము కల్పించినారు.



# వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్

## - అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి వెల్లడి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

అన్నమయ్య,కడప జిల్లాల్లో 9 చోరీలకు పాల్పడిన దొంగలు (ఇరగ అశోక్,గువ్వ ఆనంద్ బాబు) అరెస్ట్ చేసి వారి నుండి 185 గ్రాముల బంగారం,450 గ్రాముల వెండి,ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు.బుధవారం మదనపల్లెలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడిషనల్ ఎస్పీ ఎం.వెంకటాద్రి పర్యవేక్షణలో నిందితులను పట్టుకున్న సీసీఎస్ సీఐ కె.రాజారెడ్డి,ఎస్ఐలు నరసింహుడు,రమేష్,హరిహర ప్రసాద్,రహీముల్లాను ఎస్పీ అభినందిస్తూ నగదు రివార్డులు అందజేశారు.మదనపల్లె డిఎస్పీ బి.ప్రసాద్ పాల్గొన్నారు.ప్రజలు ఊరెళ్లేటప్పుడు విలువైన వస్తువులు ఇంట్లో ఉంచరాదని,అనుమానితులు కనిపిస్తే వెంటనే 112కు సమాచారం ఇవ్వాలని జిల్లా ప్రజలను ఎస్పీ సూచించారు.ప్రజల సహకారంతో పూర్తిస్థాయిలో నివారించవచ్చునన్నారు.యువత చెడువ్యసానాలకు దూరంగా ఉండి సన్మార్గంలో నడవాలని సూచించారు.



# పార్వతి దేవి అలంకారంలో చౌడేశ్వరి దేవి!

**పుంగనూరు ప్రజాసీమ:**

మండల పరిధిలోని చదళ్ల గ్రామంలోని సప్త మాతృక సమేత చౌడేశ్వరి దేవి అమ్మ వారు బుధవారం ప్రసన్న పార్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో పురుష సూక్తము నారాయణ సూక్తము మన్య సూక్తాలతో హోమాలు నిర్వహించారు. అనంతరం వేణుగోపాల్ రెడ్డి దంప తులు పూర్ణాహుతి, మహా మంగళ హారతి సమర్పించారు ఎన్ వి ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



ప్రజా సీమ

# ఎర్రచందనం స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు.. ఎనిమిది మంది అరెస్ట్

-రూ.1.30 కోట్ల విలువైన దుంగలు,వాహనాలు స్వాధీనం-కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్





**కడప, అక్టోబర్ 14 (ప్రజా సీమ):**

ఎర్రచందనం అక్రమ నరికివేత, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. బుధవారం కడపలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాపై పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారి నుంచి 1,984 కిలోల బరువున్న 70 ఎర్రచందనం దుంగలు, మూడు వాహనాలు, కాఫీ పొడి ఉన్న 643 అట్టపెట్టెలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి మొత్తం విలువ రూ.1,30,34,400గా అంచనా వేసినట్లు పేర్కొన్నారు. మైదుకూరు డీఎస్పీ జి. రాజేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో, కడప ఎర్రచందనం దళం ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్‌కు అందిన కచ్చితమైన సమాచారంతో పోలీసులు చర్యలు చేపట్టారు. పోరుమామిళ్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జి. సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రత్యేక బృందం ఎస్.ఏ. కాశినాయన మండలం ఆకుల నారాయణపల్లె గ్రామ సమీపంలోని రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టింది. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో జ్యోతి వైపు నుంచి వచ్చిన మూడు వాహనాలను అనుమానంతో ఆపేందుకు ప్రయత్నించగా, అందులో ఉన్న స్మగ్లర్లు గొడ్డళ్లు, రాళ్లతో పోలీసులపై దాడికి యత్నించి పారిపోయేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని చుట్టుముట్టి ఎనిమిది మందిని పట్టుకోగా, మరికొందరు పరారయ్యారు.

అరెస్టయిన వారిని తమిళనాడు రాష్ట్రానికి చెందిన పెరుమాళ్ (42), శక్తివేల్ పొట్టి (37), వెల్లయ్యన్ శ్రీనివాసన్ (43), అన్బళగన్ (46), సురేష్ (22), దురైసామి అన్నామలై (46), కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన రఘు సెల్వకుమార్ (38), ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన చాబోలు వెంకట కుమార్ (22)గా గుర్తించారు. వీరిలో కొందరు కూలీలుగా, మరికొందరు డ్రైవర్లుగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న వాటిలో 70 ఎర్రచందనం దుంగల విలువ రూ.81,34,400గా, ఐచర్ కంటైనర్ విలువ రూ.28 లక్షలుగా, టూఫాన్ వాహనం విలువ రూ.16 లక్షలుగా, మారుతి స్విఫ్ట్ డిజైర్ కారు విలువ రూ.5 లక్షలుగా అంచనా వేశారు. అదేవిధంగా, ఎర్రచందనం దుంగలను కంటైనర్‌లో దాచేందుకు ఉపయోగించిన కాఫీ పొడి ఉన్న 643 అట్టపెట్టెలు, పోలీసులపై దాడికి ఉపయోగించిన ఐదు గొడ్డళ్లు, ఆరు రాళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్లు కంటైనర్‌కు కేఏ05 ఏకే 7082, టూఫాన్ వాహనానికి ఏపీ39 యూఎక్స్ 4068, మారుతి స్విఫ్ట్ డిజైర్ కారుకు ఏపీ39 యూజీ 4466గా ఉన్నాయి. ఈ కేసులో సమర్థంగా పనిచేసి నిందితులను అరెస్టు చేయడంతో పాటు విలువైన ఎర్రచందనం దుంగలు, అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహనాలను స్వాధీనం చేసుకున్న పోరుమామిళ్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జి. సుబ్రహ్మణ్యం, ఎర్రచందనం దళం ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్, పోరుమామిళ్ల ఎస్ఐ ఎ. విద్యాసాగర్, ఎస్.ఏ. కాశినాయన పోలీస్‌స్టేషన్ ఎస్ఐ డాక్టర్ నాయక్‌తో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎర్రచందనాన్ని నరికినా, దాచినా, కొనుగోలు చేసినా, రవాణా చేసినా లేదా ఈ అక్రమ కార్యకలాపాలకు సహకరించినా సంబంధిత వ్యక్తులపై కఠినమైన కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పునరావృత నేరాలకు పాల్పడేవారిపై పీడీ చట్టాన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిసినవారు పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# మంత్రి నారా లోకేష్ బాబుని కలసిన బోడిపాటి శ్రీనివాస్ దంపతులు

- మదనపల్లె మున్సిపల్ ఛైర్ పర్సన్ రేసులో బోడిపాటి మమత

**మదనపల్లె (ప్రజా సీమ) :**



మంత్రి నారా లోకేష్ బాబును విజయవాడలో బుధవారం అన్నమయ్య జిల్లా కేంద్రం,మదనపల్లి పట్టణానికి బోడిపాటి శ్రీనివాస్,మమత దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. మదన పల్లె మునిసిఫల్ ఛైర్మన్ అభ్యర్థులు ఎంపిక ప్రక్రియ జరుగుతున్న వేళ వీరు మంత్రిని కలవడం ప్రాధాన్యత సంత రించు కుంది. గత కొన్ని దశాబ్దాలుగా బోడిపాటి శ్రీనివాస్ తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ పార్టీ బలోపే తానికి నిర్విరామ కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ బాబు,పార్టీ ప్రము ఖులతో ఆయన సత్సంబంధాలు కలిగి ఉన్నారు. వారు పార్టీకి చేసిన సేవలకు మదనపల్లె మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ పదవి బోడిపాటి మమతకు కేటాయిస్తే బాగుంటుందని అధిష్టానం భావిస్తోంది. ఇప్పటికే మదనపల్లె పట్టణ కూటమి నాయకులు,కార్యకర్తలను ఐవిఆర్ఎస్ కాల్స్ పంపుతున్నట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారికే ప్రాధాన్యతనిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేసిన సంగతి విధితమే. మదనపల్లె మునిసిపల్ ఛైర్మన్ పదవిపై కూటమి నుండి పలువురు ఆసక్తి చూపుతున్న తరుణంలో ఎవరికీ కేటాయిస్తారోనని ప్రజలు,రాజకీయ విశ్లేషకులు వేచిచూస్తున్నారు.

# టిడిపిలో కనుమకుంట కుటుంబానిది ప్రత్యేక ముద్ర

- పుంగనూరు మునిసిఫల్ ఛైర్ పర్సన్ రేసులో సులోచన

**మదనపల్లె (ప్రజా సీమ) :**




ఏపీలో మునిసిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ సందడి మొద లైంది. ముఖ్యంగా అన్నమయ్య జిల్లా, పుంగ నూరు నియోజకవర్గం, పుంగ నూరు మున్సిపల్ చైర్మన్ పదవికి టిడిపి నుండి నలుగురు మహిళ నేతల పేర్లు ప్రస్తావనకు వస్తున్నాయి. రాజంపేట పార్లమెంట్ సెక్రటరీ పర్వీన్ తాజ్, వెంకటరమణ రాజు భార్య చంద్రకళ, ఇబ్రహీం భార్య షమీల, విశ్రాంత డి.ఎస్.పి సుకుమార్ బాబు భార్య సులోచన పేర్లు ప్రత్యేకంగా విన బడు తున్నాయి. ముఖ్యంగా కనుమ కుంట కుటుంబం రాజకీయాలలో సుదీర్ఘంగా కొనసాగుతూ తనదైన ముద్ర వేసుకుంది. తెలుగుదేశం సీనియర్ నాయకులు, విశ్రాంత డీఎస్పీ సుకుమార్ బాబు నిర్విరామంగా పార్టీ కార్యక్రమాలు,సేవాకార్యక్రమాలను నిర్వ హిస్తున్నారు. క్రీడాకారులను క్రీడల్లో ప్రోత్సహించడం,ఆలయాల అభివృద్ధికి సహకారం, విద్యార్థులు అభ్యున్నతికి విశేష కృషిచేస్తున్నారు. గతంలో ఆయన సోదరుడు,ఆయన సతీమణి సులోచనలు టిడిపి తరఫున కౌన్సిలర్లుగా విజయం సాధించి పట్టణ అభివృద్ధికి విశేష కృషి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ బాబు ఇతర పార్టీ ప్రముఖులతో సుకుమార్ బాబు మంచి సంబంధాలు కలిగి ఉన్నారు. పార్టీకి వారు అందిస్తున్న సేవలను గుర్తించి అధిష్టానం కనుమకుంట సులోచనకు పుంగనూరు మునిసిపల్ ఛైర్ పర్సనుగా అవకాశం కల్పించాలని పలువురు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మిట్స్ యూనివర్సిటీలో జాతీయస్థాయి సాంకేతిక సింపోజియం

– ఔరా–2కె26 2.0లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు





**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లె సమీపంలో గల మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) విభాగం వారు బుధవారం జాతీయస్థాయి సాంకేతిక సింపోజియం ఔరా–2కె26 2.0 (ఔరా–2కె26 2.0) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బెంగళూరులోని వి.ఎం.ఎస్ కన్సల్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మరియు డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కార్పొరేట్ రంగంలో కృత్రిమ మేధస్సు ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ముఖ్యంగా ఏఐ ఆధారిత నియామక ప్రక్రియలు,రెజ్యూమ్‌ల పరిశీలన, అభ్యర్థుల సామర్థ్యాల మూల్యాంకనం,ప్రతిభావంతులైన ఉద్యోగుల ఎంపికలో ఏఐ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. వ్యాపార ప్రక్రియలను వేగవంతం చేయడం, ఉత్పాదకతను పెంచడం,సమాచార ఆధారిత నిర్ణయాలు తీసుకోవడంలో వివిధ సంస్థలు ఏఐ సాధనాలను సమర్థ వంతంగా వినియోగిస్తున్నాయన్నారు. విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంతోపాటు, ఆధునిక ఏఐ సాంకేతికతలపై పరిజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని తెలిపారు. విద్యార్థులు జనరేటివ్ ఏఐ,డేటా అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్ మరియు ఏఐ ఆధారిత పరిశోధనలలో నూతన ఆవిష్కరణలు చేయాలని,వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో ఏఐ భవిష్యత్తులో ముఖ్య పాత్ర పోషితుందని తెలిపారు. ప్రస్తుతం మారుతున్న సాంకే తిక పరిజ్ఞానానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ,కార్పొరేట్ సంస్థల అంచనాలకు అనుగుణంగా సిద్ధమైతే మెరుగైన ఉద్యోగావకాశాలను పొందవచ్చని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ సాంకేతిక విద్యార్థుల మధ్య సాంకేతిక ఆవిష్కరణలు, సహకార అభ్యాసం మరియు ఆలోచనల మార్పిడిని ప్రోత్స హించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా ఆధునిక సాంకేతిక సెషన్‌లు, పేపర్ ప్రెజెంటేషన్‌లు,ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు మరియు జనరేటివ్ ఏఐ ఆధారిత పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామ నాథన్, విభాగాధిపతి డాక్టర్ ఆర్.కల్పనా,కో–ఆర్డినేటర్స్ డాక్టర్ పూంగోద్రై, డాక్టర్ చొక్కనాథన్,కో–కోఆర్డినేటర్ కె.మహమ్మద్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణమూర్తి అలంకారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు

## రాజంపేటలో శరన్నవరాత్రి ఉత్సవాలు..

## అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

**రాజంపేట (ప్రజా సీమ):**

పట్టణంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు శ్రీకృష్ణమూర్తి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడి, ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.



# శ్రీమహమ్మారమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి వేడుకలు

– వెన్నెతో అన్నపూర్ణేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు





**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లి పట్టణం ఎస్బిఐ కాలనీ నందు వెలసిన శ్రీమహమ్మారమ్మ తల్లి దేవస్థానం నందు శరన్నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం వెన్నెతో అన్నపూర్ణేశ్వరి దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వాతావరణలో వేడుకలు జరుగుతున్నాయి. అమ్మవారికి పంచామృతాభిషేకం, తీర్థప్రసాద వినియోగము,లలిత సహస్రనామ కుంకు మార్చన, ప్రాకారోత్సవం,అమ్మవారికి దశ విదహారతులు, మహా మంగళ హారతి నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ కమిటీ అధ్యక్షులు బొమ్మాడి రామకృష్ణారెడ్డి,గౌరవ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి,నాదెళ్ళ వెంకటేశ్వర ప్రసాద్ (శివన్న),డి.ద్వారకనాథ రెడ్డి,వైస్ చైర్మన్ కొండుపల్లి ప్రసాద్ బాబు,సెక్రటరీ గంగాసాని మస్తాన్ రెడ్డి,ట్రెజరర్ పి.వి. శ్రీనివాసరామమూర్తి (భవాని శ్రీను) జాయింట్ సెక్రటరీ ఎస్.మాధవ రెడ్డి కో–ట్రెజరర్ బిఎం. వెంకటరమణ, ఆలయ ట్రస్టీలు బి.వెంకటేశ్వర రెడ్డి,శ్రీరామ సహదేవ నాయుడు,మారువేణి వెంకట్రాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఆలయ పునర్నిర్మాణం చేసిన అనంతరం మొట్ట మొదటిసారిగా దసరా శరన్నవరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతొందని తెలిపారు. కావున పుర ప్రజలు,అమ్మవారి భక్తులు నవరాత్రి ఉత్స వాలలో అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించి కృపాకటాక్షానికి పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ కాలనీ ప్రజలు,ప్రముఖులు,అమ్మవారి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాసీమ

# ఆకట్టుకున్న భాగవతుల వెంకట రామ శర్మ, బృంద సభ్యుల రామాయణం నృత్య రూపకం

## నాలుగో రోజు కొనసాగిన సరస్వతి గాన సభ 123 వ దసరా సంగీత, నృత్య నాటకోత్సవాలు

**కాకినాడ, ప్రజాసీమ ప్రతినిధి,అక్టోబర్ 14**

సరస్వతి గానసభ 123 వ దసరా సంగీత, నృత్య నాటకోత్సావాలు వైభవం గా జరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం సినిమా రోడ్డు సూర్య కళామందిరం లో నిర్వహించిన కార్యక్రమానికి పెద్ద ఎత్తున సంగీత అభిమానులు హాజరయ్యారు. మొదటి విడత లో భాగంగా నాలుగు రోజుల కార్యక్రమంలో నాలుగో రోజు కార్యక్రమంగా ప్రముఖ నాట్యాచారులు భాగవతుల వెంకట రామ శర్మ, బృంద సభ్యులు తో రామాయణం నృత్య రూపకం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. తొలుత జ్యోతి ప్రజ్వలన తో సరస్వతి గానసభ సభ్యులు కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో సరస్వతి గానసభ జీవిత కాల చైర్మన్ కొమ్మిరెడ్డి శ్రీరామ నరసింగరావు, గౌరవ అధ్యక్షురాలు పెద్దాడ సూర్యకుమారి, అధ్యక్షుడు డాక్టర్ ముళ్ళపూడి నాగేశ్వరరావు, కార్యదర్శి పేపకాయల రామకృష్ణ,ఉపాధ్యక్షులు లక్కరాజు సత్యనారాయణ (టిక్కు), సహాయ కార్యదర్శి చెరుకువాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.అధిక సంఖ్యలో సంగీత విద్వాంసులు, సంగీత శిష్యులు, సంగీత ప్రియులు హాజరయ్యారు.







# చైతన్య సంస్థలో వేడుకగా డాక్టర్ ఎన్.సేతు పుట్టినరోజు

## - ఏపీఎస్ జెఏసీ,యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పుస్తకాలు,పలకలు వితరణ







**మదనపల్లె (ప్రజా సీమ) :**

విజయభారతి స్కూల్ అధినేత,ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సేతు నలుస్వామి జన్మదిన వేడుకలు,ఏపీఎస్ జేఏసీ తరపున ఉత్తన్న,గంగరాజు,నరసింహులు,యూఎస్ఎఫ్ఐ తరపున ఆఫ్రిద్,గణేష్ ఆధ్వర్యంలో చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపీ ఆనందన్ అధ్యక్షతన అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థకు చెందిన చిన్నారులు, ఉపాధ్యాయులు,సంస్థ ప్రతినిధులు కలసి కరతాళ ధ్వనుల మధ్య డాక్టర్ సేతు నలుస్వామికి హృదయ పూర్వక జన్మదిన శుభా కాంక్షలు తెలియజేశారు. చిన్నారులకు పుస్తకాలు, పలకలు అందజేసి వారిని ఆశీర్వ దించిన డాక్టర్ సేతుని,సంస్థ తరపున జ్ఞాపిక మరియు దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డాక్టర్ సేతు నలుస్వామి మాట్లాడుతూ, గత 22 సంవత్సరాలుగా నిరాదరణకు గురైన చిన్నారులకు ఆశ్రయం,విద్య,పోషణ అందిస్తూ వృద్ధులకు అండగా నిలుస్తున్న చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ సేవలను కొనియాడారు.సంస్థ నిర్వహిస్తున్న ముత్తు ఆంగ్ల మాధ్యమ పాఠశాల,ఆనంద వృద్ధాశ్రమం తదితర సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ సంస్థకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తూ,తనవంతు తోడ్పాటును కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపీ ఆనందన్,జనరల్ సెక్రటరీ ఏ.కవితా రాణిలు మాట్లాడుతూ క్రమశిక్షణ,దేశభక్తి,విద్యా సేవలకు నిలువెత్తు నిదర్శనమైన డాక్టర్ సేతుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.విద్యార్థుల అభ్యున్నతికి,సమాజ సేవకు ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.ఏపీఎస్ జేఏసీ ప్రతినిధి ఉత్తన్న మరియు గంగరాజు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు,అవసరాలు,నిరుపేద కుటుంబాల ఇబ్బందులపై డాక్టర్ సేతు ఎల్లప్పుడూ సానుకూలంగా స్పందిస్తారని, విద్యారంగంలో ఆయన చేస్తున్న సేవలు అభినంద నీయమని కొనియాడారు.చిన్నారులకు విద్యా సామగ్రి అందించడమే కాకుండా వారిని ఆశీర్వ దించేందుకు వచ్చిన ఆయనకు హృదయపూర్వక కృత జ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోశాధికారి పి.గిరిజమ్మాళ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ.కృష్ణ చరణ్, ఉపాధ్యాయులు, చిన్నారులు,సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉత్కంఠభరితంగా 13వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్బాల్ టోర్నమెంట్ పోటీలు

## లీగ్ దశ ముగించుకుని బాలుర జట్లు సెమీఫైనల్స్ కు చేరిక





**పుల్లంపేట ప్రజాసీమా న్యూస్ :**

తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం ఎస్.డి.వి.డి. సభ స్కూల్ గ్రౌండ్స్ నందు జరుగుతున్న 13వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్బాల్ టోర్నమెంట్ రెండో రోజు పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. లీగ్ దశ, క్వార్టర్ ఫైనల్స్, సెమీఫైనల్స్లో రెండో రోజు ఆటలు ముగిశాయి. 15 జిల్లాల బాల బాలికల సాఫ్ట్బాల్ టోర్నమెంట్లో భాగంగా “నువ్వా నేనా” అన్నట్టు ఉత్కంఠతో మ్యాచ్లు జరిగాయి.

**చిత్తూరు-వైయస్సార్ కడప మధ్య ఉత్కంఠ పోరు**

సాయంత్రం జరిగిన వైయస్సార్ కడప జిల్లా, చిత్తూరు జిల్లా మధ్య జరిగిన పోటీ ఉత్కంఠభరితంగా కొనసాగింది. మొదటి మ్యాచ్లో 1-6తో వెనుకబడిన కడప జట్టు, రెండో మ్యాచ్ కు వచ్చేసరికి ఒక్కసారిగా పుంజుకుని “నువ్వా నేనా” అన్నట్టు తలపడి 6 తో 14 పాయింట్స్ సాధించి ఎనిమిది పాయింట్ల తేడాతో విజయం సాధించింది. “ఇది కదా సాఫ్ట్బాల్ మ్యాచ్ అంటే” అన్నట్టు కొనసాగిన ఈ ఉత్కంఠ మ్యాచ్, వీక్షిస్తున్న ప్రజలను ఉత్సాహపరిచింది.

**సెమీఫైనల్స్ జాబితా**

లీగ్ దశ మ్యాచ్లను ముగించుకుని బాలుర జట్లు సెమీఫైనల్స్కు చేరుకున్నాయి.

బాలుర సెమీఫైనల్స్

శ్రీకాకుళం జిల్లా జం వైయస్సార్ కడప జిల్లా

✓ కర్నూలు జిల్లా జం విజయనగరం జిల్లా

**బాలికల సెమీఫైనల్స్:**

✓ గుంటూరు జిల్లా జం విజయనగరం జిల్లా

✓ చిత్తూరు జిల్లా జం కడప జిల్లా

**సూపర్ సెమీఫైనల్స్**

సూపర్ సెమీఫైనల్స్లో భాగంగా గెలిచినవారు ఓడినవారితో, ఓడినవారు గెలిచినవారితో పోటీపడి ఫైనల్కు చేరుకోనున్నాయి. నేడు జరిగే పోటీలు ఉత్కంఠభరితంగా సాగే అవకాశం ఉందని నిర్వాహకులు తెలియజేశారు. ఈ వివరాలను ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్బాల్ టెక్నికల్ ఇంచార్జ్ ఏ.ఎస్.ఎస్. జగదీశ్వర్ రెడ్డి తెలియజేశారు.

**నిర్వాహకుల కృషి**

ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల పీడీలు, జిల్లాల మేనేజర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సాఫ్ట్బాల్ ఆడి అలసిపోయిన బాల బాలికలకు ఉత్సాహాన్ని నింపేందుకు క్యాంపైర్ ఏర్పాటు చేసి, ఆటపాటలతో వారిని ఆనందపరిచారు. ఈ కార్యక్రమాన్ని కడప జిల్లా సెక్రటరీ రామ సుబ్బారెడ్డి పిల్లలకు భోజన సౌకర్యాలు, కాంబినేషన్ దగ్గరుండి చూసుకుంటూ, వారికి ఎటువంటి లోటు లేకుండా పర్యవేక్షిస్తున్నారు.రెండో రోజు పోటీలు ఉత్కంఠభరితంగా ముగియగా, మూడో రోజు ఫైనల్ పోటీలు జరగనున్నాయి.

# అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చిన చౌడేశ్వరీ దేవి

## - నాలుగో రోజుకి చేరిన శరన్నవరాత్రి ఉత్సవాలు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

పట్టణంలోని నీరుగట్టువారిపల్లె నందు వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో దసరా (శరన్నవరాత్రి) ఉత్సవాలు,30వ వార్షికోత్సవ వేడుకలు పండుగ వాతావరణంలో జరుగుతున్నాయి.ఇందులో భాగంగా నాలుగవ రోజైన బుధవారం శ్రీ చౌడేశ్వరి అమ్మవారు అన్నపూర్ణేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకము, తీర్థప్రసాద వినియోగము,అమ్మవారికి ప్రత్యేక అలంకరణ,మహా మంగళ హారతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు పురాణం చంద్రశేఖర్,కమిటీ గౌరవ అధ్యక్షులు రామిశెట్టి నీలకంఠ,గౌరవ ఉపాధ్యక్షులతో పాటు కోశాధికారి రామిశెట్టి రత్నమయ్య,కార్యదర్శి బండి పవన్ కుమార్ మాట్లాడుతూ చౌడేశ్వరి ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. విద్యుత్ దీపాలు,అనేక రకాల పుష్పాలతో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించడం జరిగిందన్నారు.ఈ నెల 20వ తేదీ వరకు అమ్మవారు భక్తులకు వివిధ అలంకారాలలో దర్శనమిస్తారన్నారు.దాతల సహకారంతో ప్రతిరోజు భక్తులకు అల్పాహారం అందజేస్తున్నట్లు వారు తెలిపారు.శ్రీ చౌడేశ్వరి దేవి కృపాకటాక్షాలతో ప్రజలు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.అదేవిధంగా భక్తులు నవరాత్రి ఉత్సవాలకు పెద్దఎత్తున హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మోడెం వెంకటరమణ,శ్రీరామ్ చినబాబు,మోడెమ్ సిద్దప్ప,ఉప్పు రామచంద్ర, ఆర్.నీలకంఠ, బి.నాగరాజు,జి.లక్ష్మీనారాయణ, కె.వి నాగరాజు,ఆర్.కె మోహన, ఉప్పు శ్రీనివాసులు,ఆలయ కమిటీ సభ్యులు,తొగటవీర క్షత్రియ కుల బాంధవులు, భక్తులు పాల్గొన్నారు.



# ఉమ్మడి తూర్పు -పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్ల జాబితా రూపకల్పనను అత్యంత పగడ్బందీగా, బాధ్యతాయుతంగా చేపట్టాలి..

## అర్హత కలిగిన ప్రతి ఒక్క ఉపాధ్యాయుడిని ఓటరుగా నమోదు చేయించాలి..

## - జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

**కాకినాడ, ప్రజాసీమ,అక్టోబరు 14**



ఉమ్మడి తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గానికి సంబంధించి నూతన ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, బాధ్యతాయుతంగా, చేపట్టాలని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్ లో ఉమ్మడి తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల రెవెన్యూ, ఎన్నికల విద్యా, ఇంటర్మీడియట్ ఇతర శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్.. అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన ఓటరు జాబితా రూపకల్పనకు అనుసరించాల్సిన చట్టబద్ధమైన నిబంధనలు, విధివిధానాలపై అధికారులకు ఆయన పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950 లోని సెక్షన్ 27 మరియు ఎలక్టర్ల నమోదు నిబంధనలు-1960 లోని రూల్ 31 ప్రకారం నూతన ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తిగా కొత్తగా(డినోవో) చేపడుతున్నామన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉందని, అర్హత కలిగిన ప్రతి ఒక్క ఉపాధ్యాయుడిని ఓటరుగా నమోదు చేయించే బాధ్యత అధికారులపై ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ ఓటర్ల నమోదు ప్రక్రియకు సంబంధించి దరఖాస్తులను 2026 నవంబర్ 6వ తేదీ వరకు స్వీకరిస్తారని ఆయన వెల్లడించారు. అనంతరం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించి, డిసెంబర్ 10వ తేదీ వరకు అభ్యంతరాలును స్వీకరిస్తామని తెలిపారు. డ్రాఫ్ట్ రోల్ తయారీ పూర్తయిన తర్వాత క్లెయిమ్స్, అబ్జెక్షన్ల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని, రెండో విడత పబ్లికేషన్కు తగిన నోటీసులు ఇస్తూ, దరఖాస్తులను సక్రమంగా స్వీకరించి పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన అభ్యంత రాలన్నింటినీ డిసెంబర్ 25 నాటికి పరిశీలించి పరిష్కరించడం జరుపుకుంటున్నారు. 2026 డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ నమోదు ప్రక్రియలో భాగంగా దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు, నిర్దేశిత తేదీ నాటికి గత ఆరేళ్ల కాలంలో కనీసం మూడేళ్ల పాటు అర్హత గల విద్యా సంస్థల్లో పూర్తిస్థాయి ఉపాధ్యాయుడిగా బోధన అనుభవం కలిగి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే వారు సంబంధిత నియోజకవర్గ పరిధిలో సాధారణ నివాసిగా ఉండాలని తెలిపారు. పార్ట్-టైమ్ ఉపాధ్యాయులకు, బోధనేతర సిబ్బందికి ఈ ఓటు హక్కు వర్తించదని ఆయన స్పష్టం చేశారు.అర్హులైన అభ్యర్థులు ఫారం-19 ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఎంపీడీవో పురపాలక సంఘ కమిషనర్లు డెసిగ్నేటెడ్ అధికారుల హోదాలో దరఖాస్తులను స్వీకరించి, క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత తదుపరి ప్రక్రియ కోసం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కేవలం వ్యక్తిగత దరఖాస్తులే కాకుండా విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు, ఐటీఐలు, పాలిటెక్నిక్లు, అలాగే ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ విద్యా సంస్థలను సంప్రదించి అర్హులైన టీచర్ల పేర్లను నమోదు చేయించాలని సూచించారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఉపాధ్యాయుడు కూడా ఓటర్ల జాబితాలో పేరు కోల్పోకుండా, అలాగే అనర్హులు చేరకుండా అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రక్రియ సాగుతున్నప్పటికీ ఈ విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించడానికి వీలులేదని, ఆలస్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో తూర్పు - పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఈఆర్ఓ, కాకినాడ డీఆర్వో డా.డి.తిప్పేనాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీఓలు ఎస్. మల్లి బాబు, పి. కృష్ణమూర్తి, డీఈవో పి.రమేష్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.జగన్నాథం, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంఈఓలు ఇతర ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసీమ

# విశ్వం పాఠశాలలో ఆసక్తిగా ఇంట్రామ్యూరల్ స్పోర్ట్స్ మీట్-2026

**- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినీ,విద్యార్థులు - హాజరైన విశ్వం గ్రూప్స్ ఛైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి**




**మదనపల్లె (ప్రజా సీమ) :**

విశ్వం పాఠశాల ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇంట్రామ్యూరల్ స్పోర్ట్స్ మీట్ 2026-27ను మూడు రోజుల పాటు అత్యంత ఉత్సాహంతో క్రీడాస్ఫూర్తితో జరుపుకుంది.ఈ క్రీడా సంబరాలు ఈనెల 9వ తేదీ (శుక్రవారం) కిండర్ గార్టెన్ మరియు ప్రైమరీ క్రీడలతో ప్రారంభ మయ్యాయి. ఇందులో చిన్నారులు సరదా ఆటలలో పూర్తి ఉత్సాహంతో పాల్గొని,ఒక ఆనందకరమైన ఆరం భాన్ని ప్రారంభించారు.సోమవారం లాంఛనప్రాయ ప్రారం భోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమం అద్భుతమైన ఒలింపిక్ టార్చ్ పరేడ్‌తో ప్రారంభమైంది. అనంతరం ఐక్యత,శక్తి,విజయం అనే ఇతివృత్తంతో నాలుగు హౌస్‌ల మార్చ్ పాస్ట్,ఆ తర్వాత ప్రమాణ స్వీకారం,టార్చ్ వెలిగించడం మరియు సాంస్కృతిక ప్రదర్శన జరిగాయి.సీనియర్,జూనియర్ మరియు సూపర్ సీనియర్ బాలుర మరియు బాలికల విభాగాలకు పోటీలు నిర్వహించబడ్డాయి.వ్యక్తిగత అథ్లెటిక్ ఈవెంట్లలో 100 మీ,200 మీ,400 మీ,రిలే,స్కిప్పింగ్,చెస్,రూబిక్స్ క్యూబ్, క్యారమ్స్ బ్యాడ్మింటన్ ఉన్నాయి.ప్రేక్షకులను ఉర్రూత లూగించిన గ్రూప్ క్రీడలలో వాలీబాల్,ఖో-ఖో,కబడ్డీ, బాస్కెట్‌బాల్,త్రోబాల్ మరియు ఫుట్‌బాల్ ఉన్నాయి. నాలుగు హౌస్‌లు నిజమైన క్రీడాస్ఫూర్తిని మరియు జట్టుకృషిని ప్రదర్శిస్తూ హోరాహోరీగా పోటీపడ్డాయి. అన్ని హౌస్‌ల మొత్తం స్కోర్‌లను క్రోడీకరించిన తర్వాత మూడవ రోజు,బుధవారం విజేతలను ప్రకటించారు.కరతాళధ్వనుల మధ్య ఎ.పి.జె హౌస్‌కు ఫైనల్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ లభించింది. ప్రిన్సిపాల్ పాల్గొన్న వారందరినీ అభినందించి, క్రమశిక్షణ,ఐక్యత,నాయకత్వాన్ని పెంపొందించడంలో క్రీడల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.విశ్వం పాఠశాల ఛైర్మన్ విద్యార్థుల అద్భుతమైన ప్రదర్శనను మరియు జట్టు స్ఫూర్తిని అభినందించారు.సంపూర్ణ అభివృద్ధిలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటూ ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించినందుకు ఉపాధ్యాయులను మరియు పిఇటి సిబ్బందిని ఆయన ప్రశంసించారు. విజేత హౌస్‌ను అభినందిస్తూ, విద్యార్థులందరూ చదువులోనూ,క్రీడలలోనూ రాణించడానికి నిరంతరం కృషి చేయాలని ఆయన ప్రోత్సహించారు.




# హరిద్ర అలంకరణలో ఐశ్వర్యాశీబిక అమ్మవారి దర్శనం

**కాకినాడ : ప్రజాసీమ ప్రతినిధి, అక్టోబర్ 14**



కాకినాడ శ్రీపీఠంలో జరుగుతున్న మహాశక్తి యాగంలో భాగంగా ఐశ్వర్యాశీబిక అమ్మవారు నాలుగో రోజు బుధవారం సాయంత్రం హరిద్ర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. హరిద్ర అంటే పసుపు అని, భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో పసుపుకు పవిత్రత, శుభప్రదతకు ప్రత్యేక స్థానం ఉందని స్వామి పరిపూర్ణానంద వివరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.అర్గ స్తోత్రం, దేవీ సూక్తం ఆధారంగా హోమాలు నిర్వహించడంతో పాటు వారాహి, బగళాముఖి, ప్రత్యంగిర తదితర దేవతలకు సంబంధించిన విశేష హోమాలు జరగనున్నట్లు చెప్పారు. ఉత్తర భారతదేశంలోని అమ్మవారి సన్నిధిలో తయారు చేసిన రక్షలను శ్రీపీఠానికి తీసుకొచ్చినట్లు తెలిపారు. వాటిని అమ్మవారికి సమర్పించి పూజల్లో వినియోగించిన అనంతరం భక్తులకు అందించనున్నట్లు వివరించారు. సప్తమి రోజున మూలా నక్షత్రం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేకంగా రక్షలు అందించే ఆలోచన ఉందని చెప్పారు. ఇతర భక్తులకు కూడా వీలైనంత మందికి రక్షలు అందేలా ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. నవమి, దశమి రోజుల్లో పూర్ణాహుతి, అమ్మవారి కల్యాణం, వెయ్యి కలశాలతో కలశాభిషేకం వంటి విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.మహాశక్తి యాగం కేవలం పూజా కార్యక్రమం మాత్రమే కాకుండా సేవాభావం, సమష్టి సంకల్పం, ప్రకృతి పరిరక్షణ, అహంకార విసర్జన వంటి విలువలను ఆచరణలో పెట్టే ఆధ్యాత్మిక వేదికగా నిలవాలని పరిపూర్ణానంద స్వామి ఆకాంక్షించారు.

# ఆర్ టీ సీ డ్రైవర్ శ్రీనివాసరావు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

**అభినందించిన ప్రజా రవాణా అధికారి రమేష్**

**ప్రజాసీమ ప్రతినిధి,అక్టోబర్ 14 మంగళగిరి**

ఎన్టీఆర్ యూనివర్సిటీలో ఇటీవల జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతాకం సాధించిన ఆర్టీసీ క్రీడాకారుడిని జిల్లా ప్రజా రవాణా అధికారి కె.రమేష్ అభినందించారు. ఈ క్రీడల్లో సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.హేమంత్రో ఈవెంట్లో మొదటి స్థానంలో కాకినాడ డిపో డ్రైవర్ ఎమ్.శ్రీనివాసరావు నిలిచారు. రాష్ట్రానికి,ఆర్టీసీకి మంచి పేరు తీసుకొచ్చిన శ్రీనివాసరావును డిపిటివో అభినందించారు. రాబోయే జనవరిలో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయిన ఎం శ్రీనివాసరావు ఏపీఎస్ఆర్టీసీ కాకినాడ డిపో డ్రైవర్ గా పనిచేస్తూ ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ గా జిల్లా రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయిలో 104 పతకాలు కైవసం చేసుకున్నారు.



# 11వ వార్డులో రూ.80 లక్షలతో రైతు బజార్ ప్రారంభం

**కాకినాడ అభివృద్ధికి ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మరో ముందడుగు!**

**కాకినాడ, ప్రజాసీమ ప్రతినిధి అక్టోబర్ 14**



కాకినాడ నగర అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో 11వ వార్డులో మార్కెట్ కమిటీ ద్వారా రూ.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన రైతు బజార్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు.రైతులకు తమ పంటలను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే అవకాశం కల్పించడం, రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు.నగర ప్రజలకు నాణ్యమైన కూరగాయలు సరసమైన ధరలకు అందుబాటులోకి తీసుకురావడం ఈ రైతు బజార్ ప్రధాన ఉద్దేశ్యం అని చెప్పారు.రైతుల సంక్షేమమే లక్ష్యంగా... ప్రజలకు మెరుగైన మార్కెట్ సదుపాయాలే ధ్యేయంగా కాకినాడ నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి, ప్రజల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.ఈ రైతు బజార్ అందుబాటులోకి రావడం ద్వారా రైతులకు, వినియోగదారులకు ప్రయోజనం చేకూరడంతో పాటు స్థానిక మార్కెట్ వ్యవస్థ మరింత మెరుగుపడనున్నదనీ అన్నారు . ఈ కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బచ్చూ శేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మండపేట నియోజకవర్గం పరిశీలకురాలు తుమ్మల సునీత రమేష్ తో పాటు కూటమి నేతలు పాల్గొన్నారు.

# కూష్మాండదేవి అలంకారంలో దుర్గమ్మ

**- వైభవంగా దసరా ఉత్సవాలు**

**వేంపల్లె ప్రజాసీమ:**

కూష్మాండదేవి అలంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం స్థానిక సాయినగర్ లో వెలసిన శ్రీదుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి సందర్భంగా అర్చకుడు శాకల్య విష్ణుశర్మ నేతృత్వంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అలాగే దుర్గమ్మ తల్లిని కూష్మాండదేవి అలంకారంతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎం.రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రుల్లో దుర్గమ్మకు విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పది రోజుల పాటు అంగరంగ వైభవంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.




# క్రిష్ణవరం టోల్ ప్లాజా వద్ద స్టాప్ వాష్ అండ్ గో నిర్వహణ

**కాకినాడ ట్రాఫిక్ 1 సీ ఐ రమేష్ ప్రత్యేక వాహన తనిఖీలు**




**కిర్లంపూడి, ప్రజాసీమ, అక్టోబర్ 14**

వాహన ప్రమాదం లు తగ్గించేందుకు గాను పోలీసులు నిర్వహిస్తున్న స్టాప్ వాష్ అండ్ గో (ఫేస్ వాష్), డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఆదేశాలు మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కృష్ణవరం జాతీయ రహదారి పై టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. కాకినాడ ట్రాఫిక్ 1 సీ ఐ ఎన్ రమేష్, సిబ్బంది తో కలిసి తనిఖీలు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి పూట, తెల్లవారు జామున జాతీయ రహదారి పై వాహన దారులు అలసట, నిద్ర మత్తు వల్ల ప్రమాదాలు ఎక్కువ జరిగే అవకాశం ఉందని అన్నారు. వాహన దారులకు నిద్ర మత్తులో డ్రైవింగ్ ఎంత ప్రమాదకరమో వివరించి, భద్రత పై అవగాహన కల్పించారు. రహదారి ప్రమాదాలు నివారణ కు వాహన దారులు నిద్ర మత్తులో డ్రైవింగ్ చేయకూడదని చెప్పారు. డ్రైవింగ్ ప్రారంభించే ముందు తగిన విశ్రాంతి తీసుకోవాలని అన్నారు. అధిక వేగం, రాష్, నెగ్లేజెన్స్ గా వాహనాలు నడప కూడదని అన్నారు. వాహనం వేగం తగ్గించడం వల్ల మీ ప్రాణాలు తో పాటు ఇతరులు ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. హెల్మెట్ , సీటు బెల్ట్ ధరించి వాహనం నడపాలని చెప్పారు. చిన్న పాటి దూరమే కదా అనీ వాహన ప్రయాణం వన్ వే లో వెళ్ళ కూడదని అన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని, మీ కుటుంబ సభ్యులు మీ పై ఆధార పడి ఉంటారని చెప్పారు.



# మాతృత్వంపై శోభిత ఆసక్తికర వ్యాఖ్యలు!

**తనకు ఎప్పటినుంచో ఒక కుటుంబం కావాలని ఉండేదన్న శోభిత**

**అవి జరగాల్సినప్పుడే జరుగుతాయని వెల్లడి**

**సమాజం అభిప్రాయాలు వాతావరణం లాంటివి అని వ్యాఖ్య**

ప్రముఖ నటి శోభితా ధూళిపాళ తన వ్యక్తిగత జీవితం, మాతృత్వంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు ఎప్పటినుంచో ఒక కుటుంబాన్ని ప్రారంభించాలని కోరిక ఉందని, అయితే అలాంటివి జరగాల్సిన సమయంలో వాటంతట అవే జరుగుతాయని ఆమె అన్నారు. గతేడాది డిసెంబర్‌లో టాలీవుడ్ నటుడు నాగచైతన్యను వివాహం చేసుకున్న శోభిత, పెళ్లి తర్వాత తొలిసారి ఫ్యామిలీ ప్లానింగ్‌పై స్పందించారు.ఇటీవల 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలు పంచుకున్నారు. "నాకు ఎప్పటినుంచో ఒక కుటుంబం కావాలని ఉంది. కానీ దాని గురించి ఎక్కువగా ఆలోచించి ఒత్తిడి పెంచుకోను. ఎందుకంటే కొన్ని విషయాలు జరగాల్సిన సమయంలో వాటంతట అవే జరుగుతాయి" అని శోభిత వివరించారు. తన తొలి చిత్రం 'రామన్ రాఘవ్ 2.0' తో పరిశ్రమలోకి అడుగుపెట్టి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆమె తన కెరీర్, వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు.గతంలో తాను నటులను ఎప్పటికీ డేట్ చేయనని చెప్పిన విషయాన్ని కూడా శోభిత గుర్తుచేసుకున్నారు. అప్పట్లో తన చుట్టూ ఉన్న పరిస్థితులు, ఉదాహరణలను చూసి ఒక మూస అభిప్రాయానికి వచ్చానని, అందుకే అలా చెప్పానని అన్నారు. అయితే ఇప్పుడు తన ఆలోచనా ధోరణి పూర్తిగా మారిందని, కాలంతో పాటు అభిప్రాయాలు మార్చుకోవడంలో తనకు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు.తన వ్యక్తిగత జీవితంపై ప్రజలు, మీడియాలో జరిగే చర్చల గురించి మాట్లాడుతూ.. "సమాజం అభిప్రాయాలు వాతావరణం లాంటివి. అవి నిరంతరం మారుతూ ఉంటాయి. వాటిని పట్టించుకోకుండా మన పని మనం చేసుకుంటూ ప్రశాంతంగా ఉండటమే ముఖ్యం" అని శోభిత పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి



## బాలీవుడ్ ఇండస్ట్రీలో 'హిందూ ఫోబియా' ఉంది: ఏక్తా కపూర్

బొట్టు పెట్టుకుంటే తాంత్రికురాలు అన్నారన్న ఏక్తా కపూర్

మన జానపద కథలంటే ఇండస్ట్రీకి చిన్నచూపు అని విమర్శ

గుడి నుంచి క్లబ్‌కు వెళ్తే తప్పా? అని ప్రశ్న

ప్రముఖ బాలీవుడ్ నిర్మాత ఏక్తా కపూర్ సినీ పరిశ్రమపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బాలీవుడ్ ఇండస్ట్రీలో 'హిందూ ఫోబియా' (హిందూ వ్యతిరేకత) బలంగా పాతుకుపోయిందని ఆమె ఆరోపించారు. ఇటీవల తన కొత్త చిత్రం 'ది వాన్' ప్రమోషన్‌లో భాగంగా రణ్‌వీర్ అలహాబాదియా పాడ్‌కాస్ట్‌లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.పాశ్చాత్య ఫాంటసీ, యానిమేషన్ చిత్రాలను పరిశ్రమ తేలికగా అంగీకరిస్తుందని, కానీ భారతీయ జానపద కథలు, పురాణాలు, సంస్కృతి ఆధారంగా సినిమాలు తీస్తే మాత్రం అసౌకర్యంగా ఫీలవుతుందని ఏక్తా కపూర్ అన్నారు. తన కెరీర్ ప్రారంభంలో నుదుట బొట్టు, చేతికి ధాగా (దారం) కట్టుకున్నందుకు తనను చాలామంది వింతగా చూశారని, 'తాంత్రికురాలు', 'ఫ్రీక్' అని పిలిచారని ఆమె గుర్తుచేసుకున్నారు.ఒకసారి గుడి నుంచి నేరుగా క్లబ్‌కు వెళ్లినప్పుడు కొందరు ఆశ్చర్యపోయారని, మత విశ్వాసాలు, ఆధునిక జీవనశైలి రెండూ కలిసుండకూడదా అని తాను ప్రశ్నించినట్లు ఏక్తా తెలిపారు. అయితే, ఇప్పుడు భారతీయ జానపద కథలకు ఆదరణ పెరగడం సంతోషంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

## బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పాన్ ఇండియా సినిమా 'హైందవ' రిలీజ్ డేట్ వచ్చేసింది!

'హైందవ' విడుదల తేదీ నవంబర్ 27-కథానాయికగా కనిపించనున్న సంయుక్త

నాస్తికుడైన పోలీసు అధికారిగా హీరో పాత్ర

పురాతన ఆలయంలో విగ్రహాలు మాయమవడమే కథలో కీలకం

షూటింగ్ ముగింపు దశకు.. కొనసాగుతున్న పోస్ట్ ప్రొడక్షన్ పనులు



టాలీవుడ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హైందవ' విడుదల తేదీ ఖరారైంది. లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా నవంబర్ 27న థియేటర్లలోకి రానుంది. బుధవారం చిత్ర బృందం టీజర్‌ను విడుదల చేస్తూ ఈ విషయాన్ని ప్రకటించింది.మూన్‌షైన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సంయుక్త కథానాయికగా నటిస్తున్నారు. టీజర్ చూస్తే సినిమా కథ రంగాపురం అనే గ్రామం చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. అక్కడి పురాతన ఆలయంలో విగ్రహాలన్నీ ఒక్కసారిగా మాయమవుతాయి. అదే సమయంలో గ్రామంలో ఓ వ్యక్తి హత్యకు గురవుతాడు. దీంతో కథలో ఉత్కంఠ మొదలవుతుంది.ఆలయంలో మాయమైన విగ్రహాలు నిర్ణీత సమయంలో తిరిగి వస్తాయని ఆలయ పూజారి నమ్ముతాడు. మరోవైపు దేవుడి కన్నా మానవత్వాన్ని విశ్వసించే నాస్తికుడైన పోలీసు అధికారికి ఈ కేసు దర్యాప్తు బాధ్యతలు అప్పగిస్తారు. దీంతో విశ్వాసం, హేతుబద్ధమైన ఆలోచనల మధ్య సంఘర్షణతో పాటు అంతుచిక్కని పరిణామాలు కథలో ఆసక్తిని పెంచనున్నాయి.

**నాస్తికుడైన పోలీస్ ఆఫీసర్‌గా బెల్లంకొండ**

ఈ సినిమాలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నాస్తికుడైన పోలీసు అధికారిగా కనిపించనున్నాడు. టీజర్‌లో అతని పాత్రను శక్తిమంతంగా చూపించారు. సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, ఆలయ పూజారి పాత్రలో మహేశ్ మంజ్రేకర్ కనిపించనున్నాడు. సౌరభ్ సచ్‌దేవా, జేడీ చక్రవర్తి, శివాజీ రాజా, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు.మిస్టరీ, ఆధ్యాత్మికత, యాక్షన్ అంశాలను కలిపి దర్శకుడు లుధీర్ బైరెడ్డి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు టీజర్ సూచిస్తోంది. పురాతన ఆలయంలో విగ్రహాలు మాయమవడం, హత్య, వాటి వెనుక ఉన్న రహస్యం వంటి అంశాలు కథపై ఆసక్తిని పెంచుతున్నాయి.

**ముగింపు దశలో షూటింగ్**

మహేశ్ చందు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తి కావచ్చిందని, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా కొనసాగుతున్నాయని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకు శివ కామేశ్ డి ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. హరీశ్ కన్నన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. సామ్ సీఎస్ సంగీతం సమకూరుస్తుండగా, కార్తీక శ్రీనివాస్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. టీజర్‌తో ఆసక్తి రేకెత్తించిన 'హైందవ' నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## విజయ్ దేవరకొండ 'రణబాలి' సెన్సార్ పూర్తి.. U/A సర్టిఫికెట్‌తో విడుదలకు సిద్ధం

'తరతరాలుగా నిలిచిన కథ.. మనం తప్పక చూడాల్సిన ఒక లెజెండ్' అంటూ పోస్ట్ చేసిన సినిమా టీమ్

మన చరిత్రను సరిదిద్దే ఈ గొప్ప అనుభూతిలో పాల్గొనాలంటూ ప్రేక్షకులకు విజ్ఞప్తి

అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల చేస్తున్నట్లు ప్రకటన

చరిత్రలో మరుగునపడిన వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందిన పీరియాడిక్ డ్రామా

విజయ్, రష్మిక జోడీగా నటిస్తున్న మూడో సినిమా



యువ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన చిత్రం 'రణబాలి' విడుదలకు సిద్ధమైంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్' (జదీఖీజ) నుంచి 'ఖ/ూ' సర్టిఫికెట్‌ను పొందింది. ఈ చిత్రాన్ని అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అధికారికంగా ప్రకటించింది.ఈ సందర్భంగా నిర్మాణ సంస్థ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేస్తూ, "తరతరాలుగా నిలిచిన కథ. మనం తప్పక చూడాల్సిన ఒక లెజెండ్. మన చరిత్రను సరిదిద్దే ఈ గొప్ప అనుభూతిలో అక్టోబర్ 16న పాలుపంచుకోండి" అంటూ రాసుకొచ్చింది. ఈ ప్రకటనతో సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగాయి.దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ ఈ చిత్రాన్ని పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా, బ్రిటిష్ కాలంనాటి నేపథ్యంలో తెరకెక్కించారు. 1854-1878 మధ్య కాలంలో జరిగిన, చరిత్ర పుస్తకాల్లో చోటు దక్కని కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందించారు. బ్రిటిష్ పాలకులు చరిత్రలో తప్పుగా ప్రచారం చేసిన కొన్ని ఘటనలను ఈ సినిమా ద్వారా వెలుగులోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఇది బయోపిక్ కాదని, అణచివేతకు గురైన చారిత్రక రికార్డులు, మౌఖిక కథనాల ఆధారంగా ఆ కాలాన్ని వెండితెరపై పునర్నిర్మించే ప్రయత్నమని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ 'రణబాలి' అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనుండగా, ఆయన భార్య 'జయమ్మ' పాత్రలో రష్మిక మందన్న నటిస్తున్నారు. ప్రముఖ హాలీవుడ్ చిత్రం 'ది మమ్మీ'తో గుర్తింపు పొందిన నటుడు ఆర్నాల్డ్ వోస్లూ, ఈ సినిమాలో సర్ థియోడర్ హెక్టర్ అనే ప్రతినాయకుడి పాత్రలో కనిపించనుండటం విశేషం.'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత విజయ్-రష్మిక జోడీగా నటిస్తున్న మూడో సినిమా కావడంతో ప్రేక్షకుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పాన్-ఇండియా ప్రాజెక్టును టీ-సిరీస్ సమర్పిస్తోంది.



## అభిమానుల ప్రేమకు రష్మిక బహుమతి.. 400 కుటుంబాలకు సాయం

**3 నెలల పాటు నిత్యావసరాల ఖర్చును భరించనున్న రష్మిక**

**ఏడాది పాటు ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు వెల్లడి**

**కుటుంబాలు డబ్బు ఆదా చేసి భవిష్యత్తుకు ఉపయోగించుకోవాలని ఆకాంక్ష**

**తన సేవాభావానికి జయమ్మ పాత్ర కూడా స్ఫూర్తి అని వ్యాఖ్య**

**చిన్న సాయంతోనూ జీవితాల్లో మార్పు తేవచ్చని పిలుపు**

నటి రష్మిక మందన్న మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. ఆపదలో ఉన్న 400 కుటుంబాలకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చారు. మూడు నెలల పాటు ఆ కుటుంబాల నిత్యావసర సరుకుల ఖర్చును భరించనున్నట్లు ప్రకటించారు. తనలోని ఈ సేవాభావానికి 'రణబాలి' సినిమాలోని జయమ్మ పాత్రే స్ఫూర్తి అని వెల్లడించారు.

**ఏడాది పాటు కొనసాగింపు**

ఇప్పటివరకు తాను చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి బయటకు చెప్పలేదని రష్మిక తెలిపారు. అయితే తనను చూసి మరికొందరైనా సాయం చేసేందుకు ముందుకొస్తారనే ఉద్దేశంతో ఈ విషయాన్ని పంచుకున్నట్లు వివరించారు. ఒక్కోసారి 400 కుటుంబాలకు మూడు నెలల పాటు సాయం అందించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది పాటు కొనసాగిస్తానని వెల్లడించారు.

**భవిష్యత్తుకు భరోసా**

నిత్యావసర సరకుల కోసం ఖర్చు చేసే డబ్బు ఆదా అయితే, కుటుంబాలు తమ భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేసుకోవచ్చని రష్మిక ఆశాభావం వ్యక్తం చేశారు. చిన్న సాయం కూడా ఒకరి జీవితంలో మార్పు తీసుకురాగలదని పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో సాయం చేయాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరూ తమకు వీలైనంతలో చిన్న అడుగుతో ప్రారంభించాలని పిలుపునిచ్చారు.

**జయమ్మ పాత్రతో పోలిక**

తాను పోషించే పాత్రలు తనపై ప్రభావం చూపుతుంటాయని రష్మిక చెప్పారు. 'రణబాలి'లో జయమ్మ పాత్రకు, తన నిజ జీవిత వ్యక్తిత్వానికి చాలా పోలికలు ఉన్నాయని తెలిపారు. అందులో ఈ సేవాభావం కూడా ఒకటని వివరించారు. అభిమానులు తనపై చూపిస్తున్న ప్రేమకు ప్రతిగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తానని పేర్కొన్నారు.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma